
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 19 జూలై 2025



చెరువును... చెరబట్టారు



చెరువులో మట్టి తవ్వడంతో ఏర్పడ్డ భారీ గుంతలు

- విచ్చలవిడిగా తవ్వకాలు
- చెలరేగిపోయిన మట్టి మాఫియా
- రూపురేఖలు కోల్పోయిన కదిరినాథునికోట పెద్దచెరువు

మట్టి మాఫియా చెరువును చెరబట్టింది. విచ్చలవిడిగా మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తోంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మట్టి తవ్వకాలు... అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. చెరువు మొత్తం చెల్లాచెదురుగా మారి భారీ గుంతలు దర్శన మిస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలోనూ మట్టి తవ్వకాలు, అక్రమ రవాణా మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది. ఫలితంగా కృష్ణదేవరాయలు తవ్వించిన కదిరినాథునికోట చెరువు రూపురేఖలు కోల్పోయింది. మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టాల్సిన అధికారులు పత్తా లేకుండా పోయారు.

ములకలచెరువు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండలంలోని గ్రామ పంచాయతీలో కదిరినాథునికోట, గొడ్డావులకోట, కాశీపల్లె, నాయనివారిపల్లె, గాలేటివారిపల్లె, బీగంవారిపల్లె, చెన్నయ్యగారిపల్లె గ్రామాలు వస్తాయి. మొత్తం పంచాయతీలోని అన్ని గ్రామాల్లో 2 వేల మంది జనాభా మాత్రమే ఉన్నారు. ఇందులో కదిరినాథునికోట అతి చిన్న గ్రామం. ఈ గ్రామానికి ఆనుకుని చెద్దచెరువు ఉంది. ఈ చెరువు అసలు పేరు వడ్డిపల్లె చెరువు అయినా కాలక్రమేణా కదిరినాథునికోట చెరువుగా పిలువబడుతోంది. శ్రీకృష్ణదేవరాయలు కాలంలో తవ్వినందున ఈ చెరువుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇదిలా ఉండగా చెరువులో ఉన్న మట్టి నాణ్యతగా ఉండడంతో మట్టి మాఫియా కన్ను పడింది. గత ఐదేళ్ల పాలనలో మట్టి మాఫియాకు వైసీపీ అండదండలు మెండుగా ఉండడంతో మట్టిని భారీగా కొల్లగొట్టారు. ఎక్స్‌కవేటర్లతో మట్టిని తీసి ట్రాక్టర్లలో నింపి అక్రమంగా తరలించారు. యంత్రాలతో చెరువును గుల్ల చేశారు. ఎక్కడ పడితే అక్కడ ఇష్టానుసారంగా మట్టిని తీయడంతో చెరువంతా నాశనమైంది. ఫలితంగా చెరువులో ఎక్కడ చూసినా భారీ గుంతలు కన్పిస్తున్నాయి. యంత్రాలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగించుకునేలా గుంతల్లో మట్టి రోడ్లు ఏర్పరచుకున్నారు. ఇంత భారీ స్థాయిలో మట్టి తవ్వి, అక్రమంగా తరలించినా అధికారులకు కన్పించకపోవడం దారుణం. వంద ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న ఈ చెరువు కింద 110 ఎకరాల ఆయకట్టు ఉంది. రాయలసీమలోనే పెద్ద చెరువుగా పేరొందిన పెద్ద తిప్పసముద్రం మండలం కందుకూరు చెరువు నిండి మొరవపోయే నీరు ఈ చెరువుకు వస్తాయి. ఈ చెరువుకు ఆనుకుని మండల కేంద్రమైన ములకలచెరువు ఉంది. కదిరినాథునికోట చెరువు నుంచి ములకలచెరువు కేవలం మూడు కిలోమీటర్లే. కాగా మట్టి తవ్వకాలు, అక్రమ రవాణా ఆగకపోవడంతో గ్రామస్థుల్లో ఆందోళన నెలకొంది. చెరువులో మట్టి తవ్వకాలు ఎప్పుడు ఆగుతాయోనని ఎదురు చూస్తున్నారు. తవ్వకాలు ఆగకపోతే కదిరినాథునికోట చెరువు చరిత్రలో మాత్రమే నిలిచిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు.



కదిరినాథునికోట గ్రామం

చెరువులోకి చుక్క నీరు రాదు... నిలబడవు

చెరువులో ఇష్టారాజ్యంగా జరిపిన మట్టి తవ్వకాలతో గడ్డు కాలం ఏర్పడింది. చెరువు చెల్లాచెదురుగా మారి కాలువల ద్వారా వర్షపు నీరు వచ్చే పరిస్థితులు కన్పించడం లేదు. అలాగే ఎక్కడ చూసినా భారీ గుంతలు ఉండడంతో వర్షపు నీరు నిలబడడం లేదు. మట్టి చెల్లాచెదురుగా మారి వర్షపు నీరు త్వరగా ఇంకిపోతున్నాయి. అలాగే మట్టి మాఫియా దెబ్బ భూగర్భ జలాలపై కూడా పడింది. మట్టి అక్రమ తవ్వకాలతో చెరువులో నీరు నిల్వలేకపోవడంతో భూగర్భజలాలు తగ్గుతున్నాయే తప్ప వృద్ధి కావడం లేదు.

వందల సంఖ్యలో ఎండిపోయిన తుమ్మచెట్లు

కదిరినాథునికోట చెరువులో భారీగా ఉన్న తుమ్మచెట్లు ఎండిపోయాయి. ఐదేళ్ల క్రితం చెరువు నిండి మొరవపోయింది. దీంతో తుమ్మచెట్ల వేర్లు కుళ్లిపోయాయి. ప్రస్తుతం చెరువులో నీరు లేక, ఎండిపోయిన తుమ్మచెట్లు, మట్టి తవ్వకాలలో భారీగా ఏర్పడ్డ గుంతలతో శ్రీ కృష్ణదేవరాయలు నిర్మించిన చెరువు రూపురేఖలు కోల్పోయింది.

మట్టి అక్రమ తవ్వకాలతో చెరువు గుల్ల



కదిరినాథునికోట చెరువులో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేపట్టడంతో చెరువు మొత్తం గుల్లయింది. ఎక్కడ చూసినా భారీ గుంతలే కన్పిస్తున్నాయి. అక్రమంగా మట్టి తవ్వకాలతో చెరువులోకి వర్షపు నీరు వచ్చే పరిస్థితులు లేవు. వర్షం వచ్చినా నీరు నిలబడకుండా ఇంకిపోతున్నాయి. అధికారులు ఇప్పటికైనా మట్టి తవ్వకాలు పూర్తి స్థాయిలో నిషేదించి చెరువును కాపాడాలి. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని చెరువును కాపాడాలి.

- ప్రభాకర్‌రెడ్డి, కదిరినాథునికోట, ములకలచెరువు

మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు



కదిరినాథునికోటలో మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా మట్టి తవ్వినా, ట్రాక్టర్లతో అక్రమంగా తరలించినా మా దృష్టికి తీసుకురావాలి. చెరువుపై నిరంతరం నిఘా ఉంచాలని సంబంధిత వీఆర్‌వోకు ఆదేశాలు ఇచ్చాను. మట్టి తవ్వినా, తరలించినా తగిన చర్యలు తీసుకుంటాం.

- ప్రదీప్, తహసీల్దార్, ములకలచెరువు

ఆలస్యంగా నడిచిన ప్యాసింజర్ రైళ్లు

- తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు



ఆలస్యంగా నడుస్తున్న తిరుపతి - గుంతకల్లు ప్యాసింజర్ రైలు

ములకలచెరువు, జూలై 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి గుంతకల్లుకు నడిచే ప్యాసింజర్ రైళ్లు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తిరుపతి నుంచి గుంతకల్లు మీదుగా కదిరిదేవరపల్లెకు ప్రతి రోజూ రాత్రి నడిచే ప్యాసింజర్ రైలు మూడున్నర గంటలకు పైగా ఆలస్యంగా నడిచింది. ఈ రైలు ములకలచెరువుకు తెల్లవారుజామున 2.24 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 6 గంటలకు వచ్చింది. అలాగే ఉదయం తిరుపతి నుంచి గుంతకల్లుకు నడిచే ప్యాసింజర్ రైలు కూడా నాలుగు గంటలు ఆలస్యమైంది. ఈ రైలు ములకలచెరువుకు ఉదయం 9.34 గంటలకు రావాల్సి ఉండగా 1.34 గంటలకు వచ్చింది. పీలేరు, కలికిరి, వాయల్పాడు, మదనపల్లె రోడ్, కురబలకోట, ములకలచెరువు రైల్వేస్టేషన్లలో ప్రయాణికులు రైళ్ల కోసం పడిగాపులు కాశారు. సాంకేతిక కారణాలతో రెండు రైళ్లు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

సుందరీకరణ పనులు పూర్తి చేయండి

- సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

బి.కొత్తకోట, జూలై 18(ఆంధ్రజ్యోతి): హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల ఆకర్షణ కోసం జరుగుతున్న సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన హార్సిలీహిల్స్‌లో జరుగుతున్న పనులను పరిశీలించి కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ, పలమనేరు-కుప్పం-మదనపల్లి(పీకేఎం) అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ సంయుక్తంగా జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో టూరిజం యూనిట్ల అభివృద్ధిలో భాగంగా హార్సిలీహిల్స్ యూనిట్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. గాలిబండపై సిట్టింగ్‌రౌండ్ టేబుళ్లు, ప్రధానకూడళ్లను కలుపుతూ వాకింగ్‌ట్రాక్, తదితర పనుల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను అప్పట్లో ఆదేశించారు. ఇందులో భాగంగా హిల్స్‌పై ముఖద్వారంలో ఆర్చి, హరితసర్కిల్, జిడ్డు క్రిష్ణమూర్తి సర్కిల్‌లో జరుగుతున్న సుందరీకరణ పనులను అధికారులతో కలిసి సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటకరంగ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక చొరవ చూపుతున్నారని, హిల్స్‌పై ప్రతిపాదనలున్న అన్ని పనులను పూర్తి చేస్తారన్నారు. ఈయన వెంట ఆర్‌ఐ రామాంజినేయులు, వీఆర్వో జయరాం తదితరులు ఉన్నారు.

అక్కడ.. హిందువులదే పీర్ల పండగ...!

- ఘనంగా ఊరేగింపు



చావిడిలో కొలువుదీరిన పీర్లు

ములకలచెరువు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మీరు వింటున్నది నిజమే.. ఈ గ్రామంలో అందరూ హిందువులే. ఒక్క ముస్లిం కుటుంబం కూడా లేదు. అయినా ప్రతి ఏటా పీర్ల పండగను ఘనంగా జరుపుకుంటారు. ఈ పండగను సహజంగా ముస్లింలు చేస్తుండగా, కొన్నిచోట్ల హిందూ-ముస్లింలు సంయుక్తంగా చేసుకుంటారు. అయితే ఇక్కడ మత సామరస్యానికి ప్రతికగా హిందువులంతా కలిసి పీర్ల పండగను చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇదెక్కడో కాదు.. ములకలచెరువు మండలం గూడుపల్లెలోని ఒక మారుమూల గ్రామంలో. ఇక్కడ 200లకు పైగా కుటుంబాలు నివాసముంటున్నాయి. ముస్లింలు ఒక్కరంటే ఒక్కరు కూడా లేరు. పక్క గ్రామమైన కోనేటివారిపల్లె పంచాయతీ దాశెట్టివారిపల్లె నుంచి ముస్లిం మత గురువు ఫకృద్దీన్‌ను పిలిపించి పండగను జరుపుకుంటున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి పీర్లను ప్రత్యేకంగా అలంకరించి డప్పులు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. రాత్రి ప్రారంభమైన పీర్ల ఊరేగింపు శుక్రవారం ఉదయం వరకు సాగింది. ఆదివారం జల్ది (పీర్లకు వీడ్కోలు) కార్యక్రమం జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు.

ఎర్రచందనం దుంగల పట్టివేత

- ఏడుగురు తమిళ స్మగ్లర్లు అరెస్ట్ ● వాహనం స్వాధీనం : డీఎఫ్‌వో



స్వాధీనం చేసుకున్న దుంగలు, స్మగ్లర్లను చూపుతున్న ఫారెస్ట్ అధికారులు

పీలేరురూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శేషా చలం అడవుల నుంచి అక్రమంగా తమిళనాడుకు తరలిస్తున్న రూ.20 లక్షల విలువ గల ఎర్రచందనం పట్టుకున్నట్లు పీలేరు ఫారెస్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో గురుప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన పీలేరు ఫారెస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పీలేరు-చిత్తూరు జాతీయ రహదారి మార్గంలోని కల్లూరు నాలుగు రోడ్ల కూడలిలో ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తెల్లవారుజామున అతి వేగంగా మారుతి సుజికీ నెంబర్ ఏపీ03ఎస్ 3713 గల వాహనం వేగంగా వచ్చిందన్నారు. ఆ వాహనాన్ని ఆపే ప్రయత్నం చేయగా ఆపకుండా వేగంగా ముందుకు వెళ్లారని, ఇంతలోనే ఆ వాహనాన్ని వెంబడించగా రోడ్డు పక్కన మోరీకి ఢీకొట్టి డ్రైవర్ చీకట్లో పారిపో యినట్లు చెప్పారు. అందులో ప్రయాణిస్తున్న ఏడు మంది తమిళ స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 13 ఎర్రచందనం దుంగలు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ ఎర్రచందనం, మారుతి సుజికి వాహనం, ఏడు మంది స్మగ్లర్లను పీలేరు ఫారెస్ట్ కార్యాలయానికి తరలించామ న్నారు. పట్టుబడిన స్మగ్లర్లు తమిళనాడు రాష్ట్రం, కళువకూచ్చి జిల్లా, కళువరామ్‌మలైకి చెందిన ఏలుమలై, సెంథిల్, అన్‌బలగన్, రామన్, అన్నాదొరై, కొప్పుస్వామి, మణిగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎఫ్‌వో తెలిపారు. ఈ దాడిలో ఎఫ్‌ఆర్‌వో ఎస్.చంద్రశేఖర్, ఎఫ్ఎస్‌వో కె.ప్రకాష్‌కుమార్, ఎఫ్‌బీవోలు కె.ప్రతాప్, పి.రెడ్డిప్రసాద్, నందీశ్వరయ్య, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పూర్తి టీడీపీకే సాధ్యం

- వైసీపీ నేతలు పబ్లిసిటీతో ఐదేళ్లు గడిపేశారు
- చంద్రబాబు చేతలకు, జగన్‌రెడ్డి మాటలకు చాలా తేడా ఉంది
- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



రాయచోటిటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులు పూర్తి చేయడం టీడీపీ ప్రభుత్వానికే సాధ్యమని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నేతలు పబ్లిసిటీతో గత ఐదేళ్లు గడిపేశారని, చంద్రబాబు చేతలకు.. జగన్‌రెడ్డి మాటలకు చాలా తేడా ఉందన్నారు. చంద్రబాబు అంటే ప్రణాళికతో, బడ్జెట్‌తో క్షేత్రస్థాయిలో ఫలితాలు సాధించే ఉద్యమ నేత అని, జగన్ అంటే అభివృద్ధి పేరుతో అప్పుల బాట చూపించే భూత లాంటి వారని ఎద్దేవా చేశారు. రాయలసీమ రైతన్నకు నీళ్లు ఇవ్వడం అనేది ఫొటోకు ఫోజులు ఇవ్వడం కాదని, అది దృఢ సంకల్పంతో సాగునీటి ప్రాజెక్టులను సక్రమంగా నడిపే నాయకత్వం కావాలన్నారు. గతంలో హంద్రీ-నీవా, గాలేరు- నగిరి, తెలుగుగంగ వంటి ప్రాజెక్టులకు ఒక స్థాయిని తీసుకొచ్చిన నాయకుడు చంద్రబాబే అన్నారు. వైసీపీ హయాంలో ప్రాజెక్టులు పూర్తి చేయకుండా మల్టీ మీడియా జిమ్మిక్కులను ప్రజలపై ప్రయోగించారని విమర్శించారు. పబ్లిసిటీ ఎక్కువ, పనితీరు తక్కువ అనే విధంగా వైసీపీ పాలన సాగిందన్నారు. కర్నూలు నుంచి హైకోర్టును తరలించడమే అసలైన ద్రోహమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరాతిని రాళ్ల నగరం అంటూనే రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధిని వైసీపీ నేతలు అడ్డుకుంటున్నారని చెప్పారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు మేలుకోవాలని మంత్రి వారికి హితవు పలికారు.

ప్రతి పాఠశాలలో స్కాట్ యూనిట్ తప్పనిసరి

- డీఈవో డాక్టర్ సుబ్రహ్మణ్యం



శిక్షణలో మాట్లాడుతున్న డీఈవో

రాయచోటిటౌన్, జూలై 18: పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్కాట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని డీఈవో డాక్టర్ సుబ్రహ్మణ్యం సూచించారు. రాయచోటి పట్టణ పరిధిలోని ఎగువ అబ్బవరం సమీపంలోని ఓ కళాశాలలో శుక్రవారం భారత స్కాట్ అండ్ గైడ్స్‌లోని 250 మంది యూనిట్ లీడర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ లీడర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి స్కాట్ శిక్షణ దోహదపడుతుందన్నారు. అనంతరం ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ స్కాట్‌లో ప్రవేశం పొందడం వల్ల విద్యార్థులకు దేహదారుఢ్యంతో పాటు విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం లభిస్తుందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్లకు గౌరవ వేతనం ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం స్కాట్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి మాట్లాడారు. కళాశాల కరస్పాండెంట్ మదన్‌మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర, అసిస్టెంట్ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, మహమ్మద్‌ఖాన్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీపీవో, తహసీల్దార్

సంబేపల్లె, జూలై 18(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) రాధమ్మ, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డిలు తెలిపారు. శుక్రవారం సంబేపల్లె బీసీ సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా ? లేదా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో మరుగుదొడ్లను, స్టాక్ రూమ్‌లో బియ్యం, సరుకులు, పిల్లలకు అందించే చిక్కీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మోహన్‌బాబు, చంద్రశేఖర్, వసతి గృహ వార్డెన్ రవీంద్రరాజు, వీఆర్‌వోలు మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ సిగ్నల్..!

- కడప-బెంగళూరు రైల్వే లైనుకు మోక్షం
- రైలు మార్గం నిర్మాణానికి రూ.959 కోట్లు కేటాయింపు
- ఐదేళ్లూ పట్టించుకోని జగన్
- తండ్రి ఆశయానికి జగన్ తూట్లు
- జిల్లా వాసుల ఆకాంక్ష నెరవేర్చేందుకు చంద్రబాబు కృషి

కడప-బెంగళూరు రైలు మార్గం జిల్లా ప్రజల చిరకాల స్వప్నం. దాదాపు 18 సంవత్సరాల క్రితం ఈ మార్గం నిర్మాణానికి పురుడుపోసుకుంది. 15 సంవత్సరాల క్రితం పనులు మొదలయ్యాయి. నాలుగు దశలకు గాను తొలిదశ పనులు కడప నుంచి పెండ్లిమర్రి వరకు పూర్తయ్యాయి.. అంతే.. అనంతరం అధికారం చేపట్టిన జిల్లా వాసి వైఎస్ జగన్ కడప-బెంగళూరు రైల్వే మార్గానికి సమాధి కట్టారు. తండ్రి వైఎస్ ఆశయమైన రైల్వేమార్గాన్ని అటకెక్కించి జిల్లా వాసుల చిరకాల వాంఛపై నీళ్లు చల్లారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంతో ఈ మార్గానికి మళ్లీ మోక్షం వచ్చింది. రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్‌డీఏ సర్కారు ఉండడంతో వైసీపీ హయాంలో రెడ్‌సిగ్నల్ పడిన రైలు మార్గానికి ఇప్పుడు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర బడ్జెట్‌లో కడప-బెంగళూరు రైలు మార్గానికి రూ.959.07 కోట్లు కేటాయించింది. దీంతో ఒక్కసారిగా ఈ నిర్మాణంపై మళ్లీ ఆశలు చిగురించాయి. ఈ మార్గం పూర్తయితే కడప, అన్నమయ్య జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.



పెండ్లిమర్రిలో పూర్తయిన రైల్వేస్టేషన్

(కడప-ఆంధ్రజ్యోతి): కడప నుంచి మెట్రోనగరాలైన హైదరాబాదు, చెన్నై, బాంబే, ఢిల్లీ ఇతర ముఖ్య నగరాలకు రైలు సౌకర్యం ఉంది. అయితే పక్కనున్న బెంగళూరుకు మాత్రం రైల్వే మార్గం లేదు. కేవలం 258 కి.మీల దూరం మాత్రమే ఉన్నప్పటికీ రైల్వే మార్గానికి నోచుకోలేదు. ఈ రైలు మార్గం యూపీఏ హయాంలో పురుడు పోసుకుంది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 2007లో ఈ రైలు మార్గానికి రూ.1,023 కోట్ల అంచనా వ్యయానికి కేంద్రం అనుమతినిచ్చింది. ఈ రైల్వేమార్గం నిర్మాణానికి సగం రాష్ట్ర ప్రభుత్వం భరించాలని చెప్పడంతో అప్పటి సీఎం వైఎస్సార్ ఓకే అని చెప్పారు. వివిధ కారణాలతో మూడేళ్లు ఆలస్యం కావడంతో అంచనా వ్యయం రూ.1,784.64 కోట్లకు చేరింది. 2010 సెప్టెంబరు 1న రూ.1,784.64 కోట్ల అంచనా వ్యయంతో కడప-బెంగళూరు రైల్వే నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ పనులు కూడా పెండ్లిమర్రి వరకు సాగాయి. జగన్ సీఎంగా ఉన్న ఐదేళ్లూ ఈ రైలుమార్గాన్ని పట్టించుకోలేదు. దీంతో పెండ్లిమర్రి వరకు ఏర్పాటు చేసిన రైలుమార్గంలో కంపచెట్లు పెరిగిపోయాయి.

మళ్లీ మోక్షం

కడప-బెంగళూరుకు రైల్వే మార్గం 258.3 కి.మీ. రూ.1,784.64 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ రైలు మార్గం మన రాష్ట్రంలో 200 కి.మీ ఉంది. మిగతాది కర్ణాటక రాష్ట్రంలో ఉంది. కడప, అన్నమయ్య, కర్ణాటకలోని కోలార్ జిల్లాల మీదుగా బెంగళూరు రైల్వే మార్గాన్ని నిర్మించనున్నారు. నాలుగు దశల్లో ఈ రైలు మార్గం నిర్మాణం చేపట్టనున్నారు. మొదటి దశ కడప నుంచి పెండ్లిమర్రి 22 కి.మీ, రెండో దశ పెండ్లిమర్రి నుంచి అన్నమయ్య జిల్లాలోని వాయల్పాడు, మూడో దశ మదనపల్లె నుంచి కర్ణాటకలోని మదకట్ట వరకు, నాలుగో దశ మదకట్ట నుంచి బెంగళూరు వరకు నిర్మిస్తారు. వాయల్పాడు నుంచి మదనపల్లె వరకు ఇప్పటికే 23 కి.మీ మేర రైల్వే లైను ఉంది. ఇక కడప నుంచి పెండ్లిమర్రి వరకు తొలిదశ పనులు పూర్తయ్యాయి. ఈ మార్గంలో మొత్తం 18 రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఇడుపులపాయ, లక్కిరెడ్డిపల్లె, రాయచోటిలో రైల్వేస్టేషన్లు నిర్మించాల్సి ఉంది.

ఎంతో ఉపయోగం

కడప-బెంగళూరు రైల్వేమార్గం అందుబాటులోకి వస్తే పారిశ్రామికరంగం అభివృద్ధి జరగనుంది. సుమారు ఏడాదికి 20 మిలియన్ టన్నుల సరుకు రవాణా సాగుతుంది. ఇది కడప, అన్నమయ్య జిల్లాలకు అనుకూలంగా ఉంటుంది. ఈ ప్రాజెక్టుపై జగన్ అండ్ కో సీతకన్ను వేస్తే ఎన్‌డీఏ సర్కారు నిధులు కేటాయించింది. అలాగే కంభం - ప్రొద్దుటూరు రైల్వే నిర్మాణం చేపట్టాలంటూ చాలా కాలంగా డిమాండ్ వినిపిస్తోంది. ఇది కార్యరూపం దాల్చితే నేరుగా విజయవాడకు వెళ్లేందుకు కనెక్షన్ ఉంటుంది. దీనికి కూడా కేంద్ర ప్రభుత్వం రూ.147 కోట్లు కేటాయించింది.

ముద్దనూరు - బెంగళూరు సర్వేకోసం..

జగన్ హయాంలో కడప-బెంగళూరు రైల్వేమార్గం అటకెక్కించారు. అంతటితో ఆగకుండా ముద్దనూరు - పులివెందుల-ముదిగుబ్బ కొత్తలైనుకు ప్రతిపాదనలు పంపారు. ఈ 113 కి.మీ రైల్వే మార్గం నిర్మాణంపై సాధ్యాసాధ్యాల కోసం సర్వే చేపట్టేందుకు గాను బడ్జెట్‌లో రూ.2.75 కోట్లు కేటాయించారు. ఇక ఓబులవారిపల్లె - గుంతకల్లు ట్రిబుల్, ఫోర్ లైన్ సర్వే కోసం రూ.9.68 కోట్లు కేటాయించారు. నంద్యాల -ఎర్రగుంట్ల 126 కి.మీ రైలుమార్గం నిర్మాణం కోసం రూ.1,029.85 కోట్లు కేటాయించారు. మొత్తానికి కడప జిల్లాలో రైలు మార్గాలకు కేంద్రం ప్రాధాన్యత ఇవ్వడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొనేవారు లేకపోవడంతో తోతాపురి మామిడి కాయలు తోటల్లోనే మాగిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఏదో ఒక ధర చెల్లించి కాయలు తీసుకోవాలని రైతులు వ్యాపారులను, కమీషన్ ఏజెంట్లను కోరుతుండగా, అయితే రైతు వద్ద ఏ ధరకు కొనాలి, తాము ఏ . ధరకు అమ్ముకోవాలి, కనీసం కోత కూలీల ఖర్చుకు సరిపోయేంత మొత్త మైనా ఇవ్వక పోతే ఎలాగన్న ఆలోచనతో క మీషన్ ఏజెంట్లు కూడా కాయల కొనుగోలు కు వెనుకంజ వేస్తున్నారు. ఏమిచ్చినా పర్వాలేదని రైతులు బతిమలాడుకుంటున్నా మొహమాటంతో వ్యాపారులు మొహం చాటేస్తున్నారు. ఒక్కోసారి ఏం ఇవ్వాలో మీరే చెప్పండనిరైతులను కోరుతున్నారు. కోతలు, రవాణా చార్జీలు ఇతర ఖర్చులను బేరీజు వేసుకుని ఏం అడగాలో అర్థం కాక రైతులు, ఏమివ్వాలో తెలియక ఏజెంట్లు ఎవరిదారిన వారు మౌనంగా వెళ్లి పోతున్నారు.



తూర్పుపల్లె వద్ద తోటల్లో చెట్లకే మాగిపోతున్న తోతాపురి మామిడికాయలు



చెట్లకింద మాగి రాలిపోయిన పండ్లు

- ఆగస్టు దాకా ఆగండి : ప్రభుత్వం
- ఆగితే ఆగమైపోతాం : రైతులు
- చెట్ల పైనే మాగి, రాలిపోతున్న మామిడికాయలు
- సందిగ్ధంలో మొహం చాటేస్తున్న కమీషన్ ఏజెంట్లు

తోటల్లోనే.. తోతాపురి

పెనగలూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తోతాపురి రకం మామిడి కాయలకు ప్రభుత్వం 8 రూపాయలు గిట్టుబాటు ధర కల్పించినా, కాయ కోతల్లో మార్పు రాలేదు. రైతులు తొందరపడి కాయలు కోయవద్దని, ఆగస్టు నెలాఖరుదాకా ఉంచుకోవాలని ప్రభుత్వం చెబుతున్నా ఇప్పటికే సగం కాయలు పండుమాగి రాలిపోవడంతో, ఇంకా 45 రోజులు కాయలు చెట్లమీద ఉంటాయా అని రైతులు నిట్టూరుస్తున్నారు. ఇంకో వారం రోజులుంటే ఏ కాయలైనా పూర్తిగా మాగి రాలిపోయే పరిస్థితులు మెండుగా కనిపిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ఆగస్టు చివరిదాకా ఏ రైతు మాత్రం ఆగి ఏం చేయగలడని అంటున్నారు. ప్రభుత్వం ఫ్యాక్టరీ యజమానులతో మాట్లాడి కాయలు తీసుకునే విధంగా ఒప్పిస్తే చాలు అని రైతులు కోరుతున్నారు. ఈ ఏడు ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల మండలంలో 20 శాతం కంటే ఎక్కువగా కాపు లేదు. ఆ కాస్త కాపులోనే ఇప్పటికే సగం మాగిపోయి రాలిపోగా, మిగిలిన కాయలైనా గిట్టుబాటు ధరకు అమ్ముకుంటే కనీసం చెట్ల కింద కుళ్లిపోయిన కాయలైనా లేకుండా పోతాయని అంటున్నారు. ఈ ఏడు కనిపించిన పరిస్థితులను బట్టి చూస్తే వచ్చే ఏడు రైతులు తోటల్లో సస్యరక్షణ చర్యలు కూడా చేపట్టే పరిస్థితులు కనిపించడంలేదు. మామిడి తోటలను సాగు చేసి దివాళా తీసే పరిస్థితులు పగవాడికైనా రాకూడదని రైతులు భావిస్తున్నారు.

ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించింది



బాగా నష్టపోయిన మామిడి రైతుల దుస్థితిని ప్రభుత్వం పరిశీలించింది. వారిని ఆదుకునేందుకు గత నెలలో కిలోకు రూ.4 సబ్సిడీ ఇచ్చి, కాయలు కొనుగోలుకు వంద కోట్లు మంజూరు చేసింది. ఈ నెలలో మరలా కిలోకు 8 రూపాయలు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకునేందుకు ముందుకు వచ్చింది. గతంలో ఇంతకంటే ఏ ప్రభుత్వం మామిడి రైతులకు సబ్సిడీ ఇచ్చి గిట్టుబాటు ధర కల్పించ లేదు. కూటమి ప్రభుత్వం రైతుల కోసం మద్దతు ధర ప్రకటించింది.

-పెరుగు కృష్ణయ్యానాయుడు, రైతు సంఘం నేత

పల్ప్ ఎగుమతులు పడిపోయాయి



పల్ప్ ఎగుమతులు నిలిచిపోవడంతో మామిడికాయల కొనుగోలుకు ఫ్యాక్టరీ యజమానులు మొగ్గు చూపడంలేదు. కమీషన్ ఏజెంట్ల ఒత్తిడి తట్టుకోలేక రైతుల నుంచి సేకరించే కాయలను ఫ్యాక్టరీకి తెమ్మంటున్నారు. కాయలు కొనుగోలు చేసినందున వచ్చే కాస్తో కూస్తో డబ్బులైనా ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వం చొరవ చూసుకుని పల్ప్ ఎగుమతులకు చర్యలు తీసుకుంటే రైతులను ఆదుకోవచ్చు.

- పుచ్చకాయల లక్ష్మీనరసయ్య, కమీషన్ వ్యాపారి

పారిశుధ్యంపై శ్రద్ధ చూపండి : ఆర్డీవో



పారిశుధ్య కార్మికుడితో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

గుర్రంకొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. మండలంలోని రామాపురం డంపింగ్ యార్డును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ డంపింగ్ యార్డు నిర్మాణ విషయమై వివాదం కోర్టులో ఉంది. ఇందుకు సంబంధించిన వివరాలను నాయకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పారిశుధ్యం నిర్వహణను తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికుడితో మాట్లాడి వేతనాలు అందుతున్నాయా, నెలకు ఎంత వేతం వస్తుందన్న వివరాలను తెలుసుకున్నారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ సదాశివప్పనాయుడు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య లావాదేవీలపై ఆడిట్



మహిళా సమాఖ్య లావాదేవీలను తనిఖీ చేస్తున్న ఆడిటర్లు, అధికారులు

మదనపల్లె టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండల మహిళా సమాఖ్యలో ఏడాది పాటు నిర్వహించిన రూ.140 కోట్ల లావాదేవీలపై ఆడిట్ అధికారులు పరిశీలన ప్రారంభించారు. శుక్రవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆడిటర్ ఎం.రాజ శేఖర్ ఆధ్వర్యంలో నలుగురు సభ్యులు ఆడిట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏరియా కోఆర్డినేటర్ సాంబశివ మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు మదనపల్లె మండ లంలోని 76 గ్రామ సమాఖ్యల రుణాలు, బ్యాంకు లింకేజీలు, స్త్రీ నిధి రుణాలకు సంబంధించి చెల్లింపులు, రికవరీలు, ఖర్చులపై ఆడిట్ జరుగుతోందన్నారు. కొత్త రుణాలపై ఎస్ హెచ్‌జీ సభ్యుల తీర్మానాలు పరిశీలిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ బృందం సభ్యులు విజయ్‌కాంత్, గిరికుమార్‌రెడ్డి, డీఎంజీ గంగాధర్, సీసీలు, సంఘమిత్ర తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

మదనపల్లె అర్బన్; జూలై 18 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మదనపల్లె పట్టణం, కనకదాస్‌నగర్‌కు చెందిన మల్లయ్య కుమారుడు వెంకటరమణ నాయుడు (50) స్థానిక నీరుగట్టువారిపల్లెలోని టమోటా మార్కెట్‌లో దినసరి కూలీగా పని చేస్తుంటాడు. గురువారం రాత్రి పని ముగించుకుని నడుచుకొంటూ ఇంటికి వెళుతుండగా చౌడేశ్వరీ కళ్యాణమండపం వెనుకవైపు జాతీయ రహదారిలో గుర్తుతెలియని వాహనం ఢీనడంతో అక్కడి అక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెంటనే తమ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని మృతలదేహాన్ని పరిశీలించి, అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. టూటౌన్ సీఐ రామచంద్ర కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య కళావతి, కుమార్తె ప్రసన్నలక్ష్మి, సాయి కుమార్, మణికంఠ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

సుండుపల్లె, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తగిలి జగన్నాథం చందు (20) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం సమీపంలో నూతన గృహానికి స్లాబ్ వేసేందుకు వచ్చిన రాయచోటి రాయుడుకాలనీకి చెందిన జగన్నాథం చందు విద్యుదాఘాతంతో మిద్దె మీద నుంచి పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

మదనపల్లె అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బి.కొత్తకోట మండలం, ఎగువ శీతోలపల్లెకు చెందిన సిద్దారెడ్డి కుమారుడు ఎం. వెంకటరమణారెడ్డి (52)ని గత నెల 26న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న వృద్ధుడు శుక్రవారం మృతిచెందాడు. ఈ మేరకు మొలకలచెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్

వీరబల్లి, జూలై18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీరబల్లి అటవీ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లర్‌ను అరెస్టు చేయడంతో పాటు మూడు దుంగలు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలియజేశారు. టాస్క్ ఫోర్స్ ఆర్ఎస్ఐ నరేశ్ టీం స్థానిక ఎస్సీవో అనిల్‌కుమార్‌తో కలిసి శుక్రవారం వీరబల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో కూంబింగ్ చేస్తుండగా అయ్యాలవారిపల్లె వద్ద ఒక వ్యక్తి మోటార్ సైకిల్ మీద నిలుచుని కనిపించాడు. దీంతో వారు అక్కడికి వెళ్లగా అతను మోటారు సైకిల్ వదిలి పారిపోయేందుకు ప్రయత్నించాడు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు అతనిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారణ చేయగా తిరుపతి జిల్లాకు చెందిన వ్యక్తిగా తేలింది. దీంతో అతన్ని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ సీఐ సురేశ్‌కుమార్ తెలిపారు.

కారును ఢీకొన్న బస్సు : ఐదుగురికి గాయాలు



కారును ఢీ కొట్టిన ప్రైవేట్ బస్సు

మదనపల్లె అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): కారును ప్రైవేటు బస్సు ఢీకొనడంతో ఐదుగురికి గాయాలయ్యాయని ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పీలేరు పట్టణానికి చెందిన తరుణ్(24), ఆసీఫ్(23), నిఖిల్(22), బాలాజీ (25), ప్రేమ కుమార్ (24) గురవారం రాత్రి పీలేరు నుంచి కారులో మదనపల్లెకు వస్తుండగా పోతబోలు నుంచి మదనపల్లెకు వస్తున్న ప్రైవేట్ బస్సు తట్టివారిపల్లె వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారందరికీ వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి, పీలేరు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

విశ్రాంత ఉద్యోగి వాహనంపై దాడి



స్థానిక పోలీసుస్టేషన్‌లో ఉన్న విశ్రాంత ఏఈ వాహనం

సిద్దవటం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలను మనసులో ఉంచుకుని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ తన వాహనంపై రాయితో దాడి చేశాడంటూ పంచాయతీరాజ్ విశ్రాంత ఏఈ సుబ్రమణ్యం శుక్రవారం పోలీసు లకు ఫిర్యాదు చేశాడు. ఒం టిమిట్టలో పంచాయతీరాజ్ ఏఈగా విధులు నిర్వహిస్తున్నప్పుడు గంగపేరూరు సచివాలయంలో నిందితుడు దీపు విధులు నిర్వహించేవాడని, మెజర్‌మెంట్ బిల్లులకు సంబంధించిన రికార్డుల విషయంలో తనపై కక్ష గట్టి తన వాహనంపై దాడి చేశాడని తెలిపాడు. ఈ ఫిర్యాదు పై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- మందులు అందుబాటులో ఉంచుకోవాలి
- గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి
- సబ్ కలెక్టరు మేఘస్వరూప్



తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి, సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టరు మేఘస్వరూప్

తంబళ్లపల్లె, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలందించాలని మదనపల్లె సబ్ కలెక్టరు మేఘస్వరూప్ ఆదేశించారు. శుక్రవారం ఆయన తంబళ్లపల్లె మండలంలో ముమ్మరంగా పర్యటించారు. ప్రభుత్వాసుపత్రిలోని ల్యాబ్, బాలింతల వార్డు, ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే, ఓపీని పరిశీలించారు. ఆసుపత్రి నిర్వహణ, పరిశుభ్రత, పారిశుధ్యం, ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, మందుల స్టాకు, వైద్యులు, సిబ్బంది కొరత, ఓపీ, సమస్యలు తదితర వివరాలను వైద్యాధికారి తేజస్వినిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది ఆసుపత్రిలో అందుబాటులో ఉండడంతోపాటు, రోగులతో స్నేహభావంతో మెలుగుతూ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం ఎర్రసానిపల్లె, గోపిదిన్నె సంపద సృష్టి కేంద్రాలను తనిఖీ చేశారు. గోపిదిన్నెలో చెత్త సేకరించడం లేదంటూ ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు వెళ్లిందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సేకరించిన చెత్తను బృందావనాలకు తరలిస్తున్నారా.? లేదా.? బృందావనంలో తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువులు తయారు చేస్తున్నారా.? లేదా వంటి విషయాలను పరిశీలించారు. ప్రతి బృందావనంలో చెత్త నుంచి ఎరువులను తయారు చేసి స్థానిక రైతులకు విక్రయించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఎరువులను విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. తడి, పొడి చెత్త సేకరణ సక్రమంగా జరిగే విధంగా గ్రామ కార్యదర్శులు చర్యలు తీసుకునేలా చూడాలని ఎంపీడీవోను ఆదేశించారు.. ఆయన వెంట నియోజకవర్గ ప్రత్యేకాధికారి అమర్‌నాథరెడ్డి, తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో థామస్‌రాజ, ఎంఈవో త్యాగరాజు, వైద్యాధికారి తేజస్విని, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

- ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీ



ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులు

మదనపల్లెటౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కల్యాణదుర్గం ఏడీఏ ఎల్లప్ప హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాలను విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్, వ్యవసాయశాఖ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉంచుకోవాలని, ఎమ్మార్పీ ధరలకే యూరియా విక్రయించాలన్నారు. భూమి పత్రాల ప్రకారం, ఆధార్ కార్డులున్న రైతులకే ఎరువులు విక్రయించాలన్నారు. క్రిమి సంహారిణిలు, విత్తనాల విక్రయాల్లో తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. అనంతరం పట్టణంలోని ఐమాక్స్ ఫర్టిలైజర్స్, రైతుమిత్ర, ప్రసాద్ ఆగ్రో, కిసాన్ అగ్రిమాల్ దుకాణాలను తనిఖీ చేశారు. కిసాన్ అగ్రిమార్ట్‌లో రూ1.14లక్షల విలువైన అనుమ తులు లేని క్రిమిసంహారిణిని సీజ్ చేశారు. కార్యక్రమంలో మదనపల్లె ఏఓ నవీన్ కుమార్‌రెడ్డి, జేడీఏ కార్యాలయం ఏఓ టి.పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ షెడ్ పనులు సద్వినియోగం చేసుకోండి

పెద్దతిప్పసముద్రం జూలై 18 (ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రంగసముద్రం వాటర్ షెడ్ ఛైర్మన్ సుబ్రమణ్యం రైతులకు సూచించారు. సంపతికోట ప్రాజెక్టు రంగసముద్రం మైక్రో వాటర్‌షెడ్‌లో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఆరు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు కింద వాటర్ షెడ్ పనులు చేసు_్తన్నామన్నారు. రంగసముద్రం గ్రామంలో పనులకు ^సుమారు రూ 2 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, రైతులకు ఉపయోగపడే పనులైన నీటి నిల్వ పనులు, చిన్న ఊటకుం టలు, పెద్ద ఊట కుంటలు, చెక్ డ్యాంలు, డకౌట్ ఫారంపాండ్‌లు, ఏర్పాటు చేసుకుంటే భూగర్భ జలాలు పెంపొందుతాయన్నారు. గ్రామాల్లో రైతులందరూ సమన్వయంతో పనులు చేపడితే ఉప యోగకరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నిర్దేశిం న సబ్సిడీ ధరలకు రైతులకు వ్యవసాయ పరికరాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అధికారి వెంకటరమణ, ఐసీబీ అధికారి మేఘనాథ్, రైతులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పబ్లిసిటీ బోర్డులపై రెవెన్యూ అధికారుల సర్వే



బెంగళూరు రోడ్డులోని డెయిరీ వద్ద సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

మదనపల్లె, అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో వెంచర్లకు సంబంధించిన పబ్లిసిటీ బోర్డులను శుక్రవారం రెవెన్యూ , ఆర్అండ్‌బీ అధికారుల సమక్షంలో మదనపల్లె మండల సర్వేయర్ సుబ్రమణ్యం, ఆర్ఐ బాలసుబ్రమణ్యం తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న రికార్డుల మేరకు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బెంగళూరు రోడ్డులో పబ్లిసిటీటీ బోర్డుల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందన్నారు. వెంటనే పబ్లిసిటీ బోర్డులను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. ఈ సర్వేలో ఆర్ఐ బాల, వీర్వోలు సంధ్యారాణి, మండల సర్వేయర్ సుబ్రమణ్యం, సచివాలయ సర్వేయర్ సురేష్, ఆర్అండ్‌బీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యాదవుల పాదయాత్రకు బీసీ హక్కుల పోరాట సమితి మద్దతు



మాట్లాడుతున్న బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్

మదనపల్లె అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): యాదవులు శాంతియుత పాదయాత్రకు బీసీ హక్కుల పోరాట సమితి మద్దతు ఇస్తున్నట్లు ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1960లో ఇండియా, చైనా మధ్య జరిగిన యుద్ధంలో భారతదేశానికి చెందిన అమరు లైన యాదవుల పేరును మిలటరీ బెటాలియన్‌కు పెట్టాలని డిమాండ్ చేస్తూ కాశీ నుంచి కన్యాకుమారి మీదుగా ఢిల్లీకి శాంతియుత పాదయాత్ర చేస్తున్న యాదవులకు తమ మద్దతు ప్రకటించినట్లు రాజశేఖర్ చెప్పారు. అ సమయంలో అక్కడ స్మారచిహ్నం ఏర్పాటు చేశారని, అనంతరం యాదవఅల పేరును మిటలరీ బెటాలియన్‌కు పెడతామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. తరువాత ఆ పేరు పెట్టలేదని, దీంతో ఆ సామాజిక వర్గానికి చెందిన కొందరు నాయకులు మిలటరీ బెటాలియన్‌కు యాద వుల పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21న సోమవారం మదనపల్లె పట్టణంలోని అమ్మచెరువు మిట్ట వద్ద ఈ పాదయాత్ర బృందానికి స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమలో బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు, బీసీలుపాల్గొనాలని పిలుపునిచ్చారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాజంపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం రాజంపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నల్లబ్యాడ్జీలు కళ్లకు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన కోర్కెల కోసం సమ్మె చేస్తున్నారన్నారు. 17 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు అయినా లేకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్ నాయకులు పీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



రోడ్డుప్రమాదంలో గాయపడిన యువకుడు

బి.కొత్తకోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలైన సంఘటన శుక్రవారం వేకువఝామున బి.కొత్తకోట మండల సరిహద్దు గౌనిపల్లె మార్గంలో జరిగింది. బి.కొత్తకోటకు చెందిన హేమంత్‌కుమార్(32) ద్విచక్ర వాహనంలో గౌనిపల్లి వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబీ కులు క్షతగాత్రుడిని మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతను చికిత్స పొందుతున్నాడు.

ఘర్షణలో ఒకరికి తీవ్రగాయాలు

నిమ్మనపల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): డబ్బు విషయంలో జరిగిన ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రెడ్డివారిపల్లి పంచాయతీ బాలేవాండ్లపల్లికు చెందిన హరిబాబు అదే గ్రామానికి చెందిన ఈశ్వర వద్ద రూ.4వేలు అప్పుగా తీసుకున్నాడు. రుణం చెల్లించేందుకు హరిబాబు నిరాకరించడంతో ఈశ్వర కట్టెతో దాడి చేశాడు. దీంతో గాయపడిన వ్యక్తిని స్థానికులు మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈశ్వర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

‘వాల్టా’కు తూట్లు..

- పట్టపగలే అక్రమంగా తరలిపోతున్న కలప
- అంతరించిపోతున్న వృక్షసంపద
- పర్యావరణానికి ముంచుకొస్తున్న ముప్పు
- దృష్టి సారించని అటవీ శాఖ అధికారులు



పట్టపగలే యథేచ్ఛగా ట్రాక్టర్లలో తరలిపోతున్న వృక్షసంపద

పెద్దతిప్పసముద్రం జూలై 18 (ఆంధ్రజ్యోతి): వృక్ష సంపద నానాటికి అంతరించి పోతుండ డంతో వాతావరణంలో పెనుమార్పులు సంభవిస్తున్నాయని, పర్యావరణ నిపుణులు వాపోతుం డగా, విరివిగా మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రభు త్వాలు ఘోషిస్తున్నాయి. అయినా, వృక్షాల నరికివేత మాత్రం ఆగడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా వృక్షాలను నరికేసి వాటిని పట్టపగలే సరిహద్దు రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుం టున్నా పట్టించు కునే నాథులు కరువయ్యారు.

పెద్దతిప్పసముద్రం మండలంలోని మడుమూ రు, రాపూరివాండ్లపల్లె, కాట్నగల్లు, పట్టెం వాండ్లపల్లె, పులికల్లు, టి.సదుం, తుమ్మరకుంట, మల్లెల, బూచిపల్లె, సంపతికోట గ్రామాల్లోని చెట్లను కొందరు వ్యాపారులు అక్రమంగా నరికేసి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారం తెలిసినా పోలీసులు మిన్నకుండి పోతుండడంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి రోజూ నాలుగైదు ట్రాక్టర్లలో కలప దుంగలను అక్రమంగా తరలించుకు పోతున్నారు.

రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే..

కొందరు స్థానిక నాయకుల అండదండలతో రెవెన్యూ అధికారులు వృక్షాల నరికివేతకు అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.తమ పొలంలోని వృక్షాలను నరికివేసేందుకు అనుమతించాలంటూ రైతులతో రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు తీసుకుని, దగ్గరుండి మరీ వృక్షాలను నరికించి కలపను తరలించుకుని పోతున్నారు. అధికారులకు ప్రతి నెల మామూళ్లు అందుతుండడంతోనే చెట్ల నరికివేత, తరలింపు మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోందని, దీని కారణంగా మండలంలో వృక్ష సంపద రోజురోజుకు అంతరించి పోయే ప్రమాదం ఏర్పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అటవీ శాఖ బీట్ అధికారి షాబీనా తాజ్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా చెట్లను అక్రమంగా నరికి తరలిస్తున్న విషయం తమ దృష్టికి రాలేదని, ఎవరైనా అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే_ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్‌లో మొండి బకాయిలు

- రూ.13.58 కోట్లు అప్పులు
- రికవరీపై ప్రభుత్వం దృష్టి
- బకాయిదారులకు నోటీసులు
- కొత్తరుణాల మంజూరుకు నిధులు కోసమేనా..?

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్‌లో మొండిబకాయిలు పేరుకుపోతున్నాయి. ప్రభుత్వాలు ఇస్తున్న నిధుల ద్వారా ఎస్సీల్లోని అర్హులకు రుణాలు అందించి ఆ సామాజిక వర్గం ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా చర్యలు చేప డుతున్నారు. అయితే రుణాలు పొందిన లబ్ధిదారులు తిరిగి సకాలంలో చెల్లించకపోవడంతో ఎస్సీ కార్పొరేషన్ నిధులు లేమితో కొట్టుమి ట్టాడు తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకపోవడంతో కార్పొరేషన్ నిర్వీర్యం అయిపోయింది. ఉన్న పథకాలను కూడా అటకెక్కించి ఐదేళ్ల పాటు ఎస్సీలకు తీవ్ర అన్యాయం చేశారు. ఇదిలా ఉండగా 2014-19 సంవత్సరాల మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీల్లోని అర్హులైన వారికి రుణాలు అందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఈ రుణాలు పొందిన వారు తిరిగి చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తిరిగి కూటమి ప్రభుత్వం అధి కారంలోకి రావడంతో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉపాధి రుణాలను అందిం చేందకు దరఖాస్తులను కూడా స్వీకరించడం జరిగింది. కానీ వివిధ కారణాలతో దరఖాస్తుల ప్రక్రియను మధ్యలోనే నిలిపివేయడంతో రుణా ల మంజూరు కూడా ప్రశ్నార్థకంగా మారుతుంది.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని అర్హులైన ఎస్సీ లకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఎన్ఎస్ఎఫ్‌డీసీ నిధుల ద్వారా 500 యూనిట్లకు 17 కోట్ల 22 లక్షల 44,554 రూపాయలు వివిధ ఉపాధి అవకాశాలు కోసం రుణాలు అందించారు. ఇందులో రవాణా సెక్టారు కింద 68 మందికి ఇన్నోవాకార్లు, 35 మందికి ఇథియోస్‌కార్లను ఇచ్చారు. నాన్ ట్రాన్స్‌పోర్టు సెక్టారు కింద 266 మందికి స్వయం ఉపాధి పథకా లను, మరో 77 మందికి ఆటోలు



రుణాలు చెల్లించి సహకరించండి

ఎస్సీ కార్పొరేషను ద్వారా స్వయం ఉపాధి కల్పన రుణాలు పొందిన లబ్ధిదారులు తిరిగి రుణాలను చెల్లించి సంస్థ అభివృద్ధికి తోడ్పడడంతో పాటు ఎస్సీ సామాజిక వర్గంలోని మరికొంత మంది అర్హుల ఆర్థికాభివృద్ధికి సహకరించాలి.

-డాక్టర్ జి.రాజ్యలక్ష్మి, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

లాంటివి ఇచ్చారు. 54 మందికి భూమి కొను గోలు పథకం కింద 3 కోట్ల 201,66 వేల రూపాయలు రుణంగా అందించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వకపోవడంతో రుణాలు ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో ఎస్సీ కార్పొరేషన్ వైపు కన్నెత్తి చూసిన వారు కూడా కనిపించని పరిస్థితి. ఈ క్రమంలో రుణాల రికవరీపై కూడా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు సిబ్బంది పెద్దగా దృష్టి పెట్టకపోవడంతో మొండి బకాయిలు పేరుకుపోయాయి.

రుణాలు రాబట్టేందుకు...

ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకం కింద ఇచ్చిన రుణాల్లో రూ.13.58 కోట్ల బకా యిలు నిల్వ ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో ఇన్నోవా కార్ల పొందిన వారు ఐదు కోట్ల మూడు లక్షలా 42వేల 750 రూపాయలు, ఇతియోస్ కార్లకు సంబంధించి 86 లక్షల రూపాయలు, నాన్ ట్రాన్స్‌పోర్టు సెక్టారు కింద పొందిన రుణాలకు సంబంధించి రూ.3.51 కోట్ల బకాయిలు ఉన్నాయి. అదే విధంగా



రుణ గ్రహీతతో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ అధికారులు

భూమి కొనుగోలు పథకం కింద 54 మందికి రూ.3.21 కోట్లు ఖర్చు చేస్తే ఒక్క రూపాయి కూడా తిరిగిరాని పరిస్థితి. దాదాపు వీరిలో చాల మంది రుణాలు చెల్లించాల్సిన గడువు కూడా తీరిపోయింది. దీంతో వీరి నుంచి రుణాలు రాబట్టేందుకు అధికారులు సమాయత్త మవుతన్నారు. లబ్ధిదారుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడి రుణాల వసూళ్లపై దృష్టి పెడుతున్నారు. రుణ బకాయదారులకు నోటీసులు కూడా జారీ చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది రుణాల వసూళ్లను వేగవంతం చేస్తున్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు డాక్టర్ జి.రాజ్యలక్ష్మి సిబ్బందికి రుణ వసూళ్లపై దిశా నిర్దేశం చేస్తూ రుణాల వసూళ్లపై దృష్టి సారిస్తున్నారు.

కొత్తరుణాల మంజూరు కోసమేనా...

పాత రుణాలు వసూలు అయితే కొత్తవారికి తిరిగి రుణాలు ఇచ్చే పరిస్థితి ఉంటుందని.. ఇందుకోసమే రుణ బకాయిలపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఐదేళ్లపాటు రుణాల కోసం ఎదురు చూసిన ఎస్సీ సామాజిక వర్గ ప్రజలు వైసీపీ ప్రభుత్వంలో నిధులు కేటాయించకపోవడంతో విసిగిపోయారు. ఈ తరుణంలో జిల్లా అధి కార యంత్రాంగంతో పాటు కలెక్టరు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎస్సీ కార్పొరేషన్ బలోపేతానికి పాత బకాయిలు వసూళ్లే కాకుండా మరిన్ని నిధులు ఇచ్చి మెరుగైన ఉపా ధి అవకాశాలు కల్పించా లని ఎస్సీ సామాజిక వర్గ ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

'తెలంగాణ అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలి'

వేంపల్లె, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిపై తెలంగాణ ప్రభుత్వం నిర్మి స్తున్న అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కాంగ్రెస్ పార్టీముఖ్య అధికారి తులసిరెడ్డి ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ ప్రభు త్వం నిర్మిస్తున్న ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం అడ్డుపడదని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు చెప్పడం సమంజసం కాదన్నారు. కృష్ణానదిపై తెలంగాణ ప్రభుత్వం బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు లేకుండా, ఎవరి ఆమోదం లేకుండా 90 టీఎంసీల సామర్థ్యం పాలమూరు-రంగారెడ్డి, 30టీఎంసీల సామర్థ్యంతో డిండి ఎత్తిపోతల పథకాలను నిర్మిస్తోందని.. వీటిని అడ్డుకో వాలని సలహా ఇచ్చారు. హంద్రీనీవా విషయంలో కాంగ్రెస్ పార్టీ కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి పనిచేయగా టీడీపీ ప్రభుత్వం చేసి నట్లు చెప్పుకోవడం శోచనీయమన్నారు. ఖర్చుపెట్టిన గణాంకాలు పరిశీలిస్తే ఎవరు ప్రాజెక్టులకు నిధులు ఖర్చుపెట్టిన విషయం తెలుస్తుందన్నారు.

పిడుగుపాటు బాధితునికి రూ.4 లక్షలు విడుదల

కలికిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దాదాపు మూడేళ్ల క్రితం పిడుగుపాటుకు గురై మృత్యువాత పడిన ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి చెందిన రైతు మల్‌రెడ్డి వీరారెడ్డి కుమారుడు నాగిరెడ్డి కుటుంబానికి రూ.4 లక్షలు విడుదల చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2022 అక్టోబరు 19వ తేదీ పిడుగుపాటుకు గురైన నాగిరెడ్డి మరణించాడు. అప్పటి ప్రభుత్వం బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించి ఊరట కల్పించి ఆదుకోవాల్సి వున్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. తాజాగా కడప కలెక్టరు ఈ దుర్ఘటనకు సంబంధించిన నివేదికను ఈ నెల 5న ప్రభుత్వానికి నివేదించారు. ఇందుకు ప్రభుత్వం తక్షణం స్పందించి శుక్రవారం పరిహారం నిధులు విడుదల చేసింది. వెంటనే డీబీటీ పద్ధతిలో బాధిత కుటుంబం బ్యాంకు ఖాతాలోకి రూ.4లక్షలు జమ చేయాలని కలెక్టరును ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

జేబీ ఆసుపత్రిలో ట్యూమర్ ప్రొస్తెసిస్ ఆపరేషన్ విజయవంతం



పేషెంట్‌ను నడిపిస్తున్న డాక్టర్ జహంగీర్‌బాషా

కడప సెవెన్ రోడ్స్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని జేబీ ఆసుపత్రిలో శుక్రవారం ఓ మహిళకు ట్యూమర్ ప్రొస్తేసిస్ ఆపరేషన్‌ను విజయవంతంగా చేసినట్లు ఎండీ డాక్టర్ జయ భారతి తెలిపారు. ఆమె వివరాల మేరకు.. చాగలమర్రి నివాసి అయిన మహబూబ్‌చాన్ అనే మహిళ మోకాలు ఆపరేషన్ చేయించుకొని చీముపట్టి నడవ లేనిస్థితిలో జేబీ ఆసుపత్రికి వచ్చింది. డాక్టర్ జహంగీర్ బాష పరీక్షించి ఆ ఎముక పూర్తిగా పాడైందని దానిప్లేస్‌లో ఆపరేషన్ చేయాలని తెలిపారు. పేషెంట్ 120 కేజీలు ఉండడం వలన ఆపరేషన్ కష్టమైందని, ఉన్న ఎముక పూర్తిగా చెడి పోవడంతో కనీసం 2 సెంటీమీటర్ల ఎముకను తీసేసి దాని స్థానంలో ఇంప్లాంట్ అమర్చాల్సిన అవసరం ఉందని తెలిపారు. హైదరాబాద్ నుంచి ట్యూమర్ ప్రొస్తసిస్ తెప్పించి ఆపరేషన్ చేసి పేషెంట్‌ను మరుసటి రోజు నడిపించారు. దీంతో ఎవరూ తమకు ఆపరేషన్ చేసి నడిపిస్తామని నమ్మకం కలిగించ లేదని.. డాక్టర్ జహంగీర్ బాష నమ్మకాన్ని కలిగించడంతో మేము ఆపరేషన్ చేయిం చుకున్నామని, ఇపుడు బాగా నడుస్తున్నానని పేషెంట్ తన ఆనందాన్ని వ్యక్తపరిచారు.

డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె ఆగదు



ప్రొద్దుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రొద్దుటూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులతో పాటు పారిశుధ్య కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చే వరకు సమ్మె ఆగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యం , మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చంటి, సాల్మా న్, విజయ్‌కుమార్, రాఘవలు స్పష్టం చేశారు. మున్సిపల్ ఇంజ నీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారంతో ఆరవ రోజుకు, పారి శుధ్య కార్మికుల సమ్మె మూడో రోజుకు చేరుకుంది. దీంతో పట్ట ణంలో పారిశుధ్య సేవలతో పాటు వాటర్ వర్క్సు, ఇంజనీరింగ్ సేవ లకు అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి గురువారం కార్మిక సంఘాల నాయకులతో జరిపిన చర్చలతో కార్మి కులు పారిశుధ్య సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లు అర్థం చేసుకునేలా మున్సిపల్ కార్మికులు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. మున్సిపల్ ఇంజనీరింగ్ పారిశుధ్య కార్మికులు చేప ట్టిన సమ్మెకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ ఛైర్మెన్లు బంగారు మునిరెడ్డి, కౌన్సిలర్లు వంశీ మద్దతు తెలిపారు.

నకిలీ ఈ-స్టాంపుల స్కాంలో ఇద్దరిపై కేసు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి

పోరుమామిళ్ల, జూలై 18(ఆంధ్రజ్యోతి): నకిలీ ఈ-స్టాంపుల స్కాంలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండా రెడ్డి తెలిపారు. శుక్రవారం పోరుమామిళ్ల పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బద్వేలుకు చెందిన అడ్వకేట్, నోటరీ మువ్వా నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మండలంలోని రంగసముద్రం పంచాయతీ మునీర్ కాంప్లెక్సు, సెయింట్ ఆంటోనీస్ స్కూలు సందు లో ఉండే లక్ష్మీనరసింహస్వామి స్టాంపువెండర్ లక్ష్మీదేవి, ఆమె తమ్ముడు సిద్దయ్య బద్వేలుకు చెందిన మువ్వా నరసింహులుకు సంబంధించిన సంతకాలు, సీళ్లు, అలాగే ప్రొద్దుటూరుకు చెందిన రామకృష్ణ వెండర్ సంతకాలు, సీళ్ల ఫోర్జరీ చేసినట్లు ఫిర్యాదు చేశా రన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేశామన్నారు.

విభజన హక్కుల సాధనకు ఢిల్లీకి....

కడప కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హక్కుల సాధనలో భాగంగా జిల్లా కాంగ్రెస్ నేతలు ఉద్యమానికి శుక్రవారం ఉదయం సంపర్క్ కాంత్రి ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీ బయిలుదేరి వెళ్లారు. ఈ సంద ర్భంగా కాంగ్రెస్ నేత ఎస్.ఎ.సత్తార్ మాట్లాడుతూ కడపలో ఉక్కు ఫ్యాక్టరీని సెయిల్ ఆధ్వర్యంలో నిర్మించాలనే డిమాండ్‌తో పాటు విభజన హామీలు నెర వేర్చాలని ఎన్డీఏ సర్కారును ఒత్తిడి చేస్తూ ఢిల్లీలో నిరసన చేపట్టడం జరు గుతోందన్నారు. ఢిల్లీ వెళ్లిన వారిలో కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు నజీర్ అహమ్మద్, నేతలు నాసీర్ హుసేన్, నాసీర్‌ఖాన్, చంద్రశేఖర్ రెడ్డి, మహిళా నాయకురాలు శ్యామలాదేవి, నాగరత్న, అక్రమ్, హబీ బ్, గంగాధర్, తాజుద్దీన్, చాన్‌బీ తదితరలు ఉన్నారు.

ఆధిక్యంలో నెల్లూరు.... వెనుకంజలో కడప జట్లు

కడప స్పోర్ట్స్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే (మూడురోజుల) క్రికెట్ టోర్నమెం టులో భాగంగా రెండో రోజైన శుక్రవారం అనంతపురం జట్టుపై నెల్లూరు జట్టు 246 పరుగుల ఆధిక్యతతో వుండగా కడప-కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో కడప జట్టు 184 పరుగుల వెనుకంజలో వుంది. వివరాలిలా.....

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 59.5 ఓవర్లలో 224 పరుగు లకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయా నికి 34 ఓవర్లలో 6 వికెట్లు కోల్పో యి 93 పరుగులు చేసింది. కాగా ఓవర్‌నైట్ స్కోర్ 93 పరుగులతో తిరిగి బ్యాటింగ్‌కు దిగిన అనం తపురం జట్టు రెండో రోజైన శుక్రవారం 60.2 ఓవర్లలో 203 పరుగు లకు ఆలౌట్ అయింది. దీంతో నెల్లూరు జట్టుకు 21 పరుగుల ఆధి క్యత లభించింది. ఇందులో కిరణ్‌కుమార్ 66 పరుగులు చేశారు. కాగా నెల్లూరు జట్టు రెండో ఇన్నింగ్స్‌కు దిగి ఆట ముగిసే సమ యానికి 61 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 225 పరుగులు చేసింది. ఇందులో గురుమోహన్ 66, రిషికుమార్‌రెడ్డి 57 పరుగులు చేశా రు. దీంతో ఇప్పటివరకు నెల్లూరు జట్టు 246 పరుగుల ఆధిక్యతతో నిలిచింది.ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-కర్నూలు జట్ల మధ్య సాగు తున్న మరో మ్యాచ్‌లో కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 65.3 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం కడప జట్టు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోర్ 54 పరు గులతో తిరిగి బ్యాటింగ్‌కు దిగి.. 51.2 ఓవర్లలో 114 పరుగులకే అన్ని వికెట్లు కోల్పో యింది. దీంతో కర్నూలు జట్టుకు 43 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధి క్యత లభించింది. ఇక బౌలింగ్ విభాగంలో రుత్విక్ కళ్యాణ్ 5 వికెట్లను పడగొట్టారు. కాగా, కర్నూలు జట్టు రెండో ఇన్నింగ్స్‌కు దిగి ఆట ముగిసే సమయానికి 57.5 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందు లో రోహిత్‌గౌడ్ 51 పరుగులు సాధించారు. దీంతో రెండు ఇన్నింగ్స్‌లకు కలిపి 184 పరుగుల ఆధిక్యతలో కర్నూలు జట్టు నిలిచింది.

ప్రేమించి పెళ్లిచేసుకొని... వదిలేశాడు

- నన్ను నా బిడ్డను చంపడానికి ప్రయత్నిస్తున్నాడు
- డీఎస్పీకి బాధితురాలి ఫిర్యాదు



డీఎస్పీ మురళినాయక్‌కు ఫిర్యాదు చేస్తున్న రజని

పులివెందుల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పులివెందులకు చెందిన శ్రీపతి చక్రవర్తి అనే వ్యక్తి తనను ప్రేమించి పెళ్లి చేసుకుని గర్భిణీని చేసి మూడు నెలలకే వదిలేశాడని తిరుపతికి చెందిన కె.లావణ్య అలియాస్ రజని ఆవేదన వ్యక్తం చేశారు. తనను తన బిడ్డను చంపేందుక ప్రయత్నిస్తున్నాడని వాపోయారు. ఈ మేరకు పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్‌కు శుక్రవారం రాత్రి ఆమె ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు..

తిరుపతికి చెందిన రజనీని పులివెందులకు చెందిన శ్రీపతి చక్రవర్తి తిరుపతిలో చదువుకునే సమయంలో ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. చివరకు పెద్దల అంగీకారంతో 2021 ఆగస్టు 15వ తేదీ తిరుపతిలో వివాహం చేసుకున్నాడు. అనంతరం రజని పులివెందులలోని అత్తగారింటికి వచ్చారు. దాదాపు మూడు నెలల పాటు వీరి కాపురం సజావుగా సాగింది. ఇంతలో రజనీ గర్భం దాల్చడంతో భర్త, అత్తమామల నుంచి వేధింపులు మొదలయ్యాయి. ఈ విషయం తన తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు తమ కూతురి జీవితం నాశనం చేయొద్దని అల్లుడి కుటుంబసభ్యులను ప్రాధేయపడ్డారు. అప్పటి నుంచి రజనీని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేయడం మొదలు పెట్టారు. వీరి వేధింపులు ఎక్కువ కావడంతో విధిలేని పరిస్థితిలో గర్భవతియైన కుమార్తె రజనీని ఆమె తల్లిదండ్రులు తిరుపతికి తీసుకెళ్లారు. అయితే వీరిని శ్రీపతి చక్రవర్తి బంధువుల ద్వారా బెదిరించడం మొదలు పెట్టాడు. బిడ్డ పుట్టాక కూడా అతడిలో మార్పు రాకపోగా.. బిడ్డను తీసుకొని వస్తే నిన్నూ నీ బిడ్డను చంపుతామని బెదిరించాడు. దీంతో తాను, తన బిడ్డ భయంభయంగా గడుపుతున్నామని రజని తెలిపారు. తన కుమారుడు పెద్దయితే ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందని చంపేందుకు రెండుసార్లు రెక్కీ నిర్వహించారని అన్నారు. కొన్ని నెలల క్రితం పులివెందులకు చెందిన మరొక అమ్మాయిని తనకు తెలియకుండా తన భర్త వివాహం చేసుకున్నాడన్నారు. దీనిపై తిరుపతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. కానీ న్యాయం జరుగుతుందో లేదోనని.. పులివెందులకు వచ్చి డీఎస్పీ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మెప్మా కార్యాలయంలో 'ప్రైవేటు' పంచాయితీలు

- రుణాల వసూళ్లపై బెదిరింపులు



మెప్మా కార్యాలయంలో మహిళలను ప్రశ్నిస్తున్న ప్రైవేటు వ్యక్తులు

పులివెందుల రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని మెప్మా కార్యాలయంలో ప్రైవే టు వ్యక్తులు డ్వాక్రా సంఘాల విషయంలో తల దూర్చి పంచాయితీలు చేస్తున్నారు. శుక్రవా రం 12గంటల సమయంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు బ్యాంకు రుణా లు చెల్లించని వారిపట్ల దురుసుగా ప్రవర్తించారు. వివరాల్లోకి వెళి తే.. పులివెందుల మున్సిపాలిటీలో డ్వాక్రా సంఘాల ద్వారా కొందరు మహిళలు రుణాలు పొందారు. రెండేళ్ల కిందట ఒక్కో క్కరు రూ.2లక్షలు రుణం పొందినట్లు సమాచారం. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించలేక పోయారు. అయితే తీసుకున్న రుణానికి సంబంధించి డబ్బులు చెల్లించాలంటూ ఆర్పీలు ప్రైవేటు వ్యక్తులను రంగంలోకి దించి బెది రిం పులకు దిగారు. దీంతో ఆ మహిళలు తాము ఇప్పుడిప్పుడే ఆర్థిక భారం నుంచి బయట పడుతున్నామని, ఎలాగోలా నెలనెల చెల్లిస్తా మని బతిమాలాడారు. మీరు కట్టా ల్సింది రూ.5వేలు, రూ.10 వేలు కాదు లక్ష రూపా యలకు పైగా అప్పు ఉన్నారంటూ బెదిరిం చారు. ఈ తతంగం అంతా మెప్మా కార్యాల యంలో జరగడం గమనార్హం. ఈ విష యమై పులివెందుల మెప్మా సీఎం హరిప్రసా ద్‌రెడ్డి వివరణ ఇస్తూ... రుణం పొందిన వారు చెల్లించకుంటే బయటే చూసుకోవాలి. మెప్మా కార్యాలయంలో అడగడం పద్ధతి కాదు. అక్కడ ఉన్న సిబ్బందితో వివరణ తీసుకుంటామని తెలిపారు.

అదుపుతప్పి లారీ బోల్తా...

డ్రైవర్, క్లీనర్ మృతి



గంగాదేవి పల్లె సమీపంలో బోల్తాపడ్డ లారీ



కమల్‌సాహెబ్, ఫక్రుద్దీన్ మృతదేహాలు

ముద్దనూరు జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి కడప,తాడి పత్రి హైవేరోడ్డులోని గంగాదేవిపల్లె సమీపంలో శుక్రవారం తెల్లవా రుజామున లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లాకు చెందిన లారీడ్రైవర్ కమల్‌సాహె బ్(64), క్లీనర్ ఫక్రుద్దీన్(45) ఇరువురు అక్కడిక్కడే మృతి చెందారు. ఎస్ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు వివరాలు... బళ్లారి నుంచి చె న్నైకి లారీలో ఇనుప పైపులను తీసుకొని వెళుతున్నారు. గంగాదేవి పల్లె సమీపంలోకి రాగానే లారీ అదుపు తప్పి చీనీ తోటలోకి దూసు కెళ్లి బోల్తా పడింది. దీంతో లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయ్యింది. లారీడ్రై వర్ కమల్‌సాహెబ్, క్లీనర్ ఫక్రుద్దీన్ లారీలో ఇరుక్కుపోయి మృతి చెందారు. వెంటనే సీఐ దస్తగిరి సంఘటనా స్థలానికి చేరుకొని మృ త దేహాలను అతికష్టం మీద బయటకు తీయించారు. లారీ ఓనర్ అమీర్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తర లించినట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి



గాయపడిన జింక

మైదుకూరు రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అటవీ జింకపై కుక్కలు దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావమై మృతి చెందింది. గురువారం అడవి నుంచి ఒక జింక తప్పించు కొని బద్వేలు రోడ్డులోని సబ్‌స్టేషన్ వద్ద తిరు గుతుండగా కుక్కలు వెంబడించి జింకను గాయపరిచాయి. కాగా అక్కడే నివశిస్తున్న ముడియం ప్రసాద్ మరి కొందరి సాయంతో కుక్కల బారి నుంచి జింకను రక్షించాడు. అనంతరం ప్రథమ చికిత్స చేసి ఫారెస్ట్ అధి కారు లకు అప్పగించారు. అయితే గాయపడిన జింకకు మైదుకూరు వెటర్నరీ ఆసుపత్రిలో చికిత్స నిర్వహించినా.. తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి చెందినట్లు ప్రొద్దుటూరు ఫారెస్ట్ అధికారి హేమాంజలి తెలి పారు. అధికారుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి నట్లు ఆమె తెలిపారు.

పాఠకులకు ముఖ్య గమనిక


క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

తాగు నీటి గోడు పట్టించుకోండి సారూ..

● నెల రోజులుగా అందని రోళ్లమడుగు నీరు

లక్కిరెడ్డిపల్లె, జూలై 18: మంచినీటి పథకం బోర్లలో నీరు అడుగంటిపోవడంతో గ్రామా ల్లో తాగునీటి కోసం జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జూన్, జూలై మాసంలో సాధారణంగా వర్షాలు కురవాలి. కానీ ఇంతవరకు చినుకు పడలేదు. 2018లో రోళ్లమడుగు నుంచి రాయచోటి, లక్కిరెడ్డిపల్లె రామాపురం మండలాలకు సానిపాయి నుంచి పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరా జరిగేది. దీంతో గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా ఉండేవి. దాదాపు రోళ్లమడుగు నీరు ఈ మూడు మండలాలకు వారానికి రెండు సార్లు వచ్చేవని ప్రజలు తెలిపారు. సానిపాయి కుమ్మరపల్లి నుంచి లక్కిరెడ్డిపల్లె మండలంలోని రవీంద్రనగర్‌లో సంపు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి అన్ని గ్రామాలకు రోళ్లమడుగు నీరు సరఫరా అయ్యేవి. అయితే నెల రోజుల నుంచి రోళ్లమడుగు నీరు ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం ట్యాంకర్ల ద్వారా అయినా నీటిని సరఫరా చేయాలని ప్రజలు అంటున్నారు. వ్యవసాయ బోర్ల వద్దకు, ఇతర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.



రవీంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన సంపు



నీరు అందక ఖాళీగా ఉన్న కొళాయిలు

తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



రోళ్లమడుగు నీరు ఆగిపోవడంతో నెలరోజులుగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రధానంగా వృద్ధులు దూరంగా వెళ్లి నీరు తెచ్చుకోలేక పోతున్నారు. రోళ్లమడుగు నుంచి నీరు వస్తే పట్టుకునే వాళ్లం. అధికారులు స్పందించి రోళ్లమడుగు నీరు సరఫరా చేయాలి.

- వెంకట్రమణ, చౌటపల్లి

రోళ్లమడుగు నీరు వదలండి



ఉన్నట్టుండి రోళ్ల మడుగు నీరు నిలిపేయడంతో ఇబ్బంది ఎదుర్కొంటున్నాం. గుక్కెడు మంచినీటి కోసం పక్క గ్రామాలకెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గ్రా మంలో ఉన్న మంచినీటి పథకం బోరులో నీరు ఎండిపోయాయి. రోళ్లమడుగు నీటిని సరఫరా చేయాలి.

- నాగరాజు, రవీంద్రనగర్, పూసల కాలనీ

త్వరలో నీరు వదులుతాం

సానిపాయి ప్రాంతంలో సంపు వద్ద రెండు మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. త్వరలో పూర్తి చేసి రామాపురం, లక్కిరెడ్డిపల్లె, రాయచోటి మండలాలకు రోళ్లమడుగు నీరు అందిస్తాం. ఐదు రోజుల లోపు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాగునీరు అందిస్తాం.

- ప్రదీప్, ఏఈ, ఆర్‌డబ్ల్యుఎస్

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎల్‌డీవో

సిద్దవటం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని డీఎల్డీవో మైథిలి అన్నారు. శుక్రవారం సిద్దవటం సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేపట్టి రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పాత బకాయిలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని, జగనన్న కాలనీలో గత 15 రోజులుగా తాగునీరు రావడం లేదని ఫిర్యాదు చేశారని, సమస్యను పరిష్కారం చేయాలని ఆదేశించారు. గ్రామంలో విద్యుత్ దీపాలు, తాగునీరు, పారిశుధ్యం సమస్యలు లేకుండా చూడాలన్నారు. మండల విస్తరణాధికారి మెహతాజ్‌యాస్మిన్, కార్యదర్శులు దాసరి రత్నరాజు, జానకి, బిల్ కలెక్టర్ సుజాత, జనసేన పార్టీ ముస్లిం మైనార్టీ నేత మహమబూబ్‌బాషా(బాబీ), చిన్నారెడ్డి, శ్రీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రి గోల్డ్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహేష్

రాజంపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని అగ్రిగోల్డ్ బాధితుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్కే ఖాదర్‌బాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాజంపేటలో అగ్రిగోల్డ్ బాధితుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేటికీ పరిష్కరించకపోవడం దారుణమన్నారు. బాధితులందరూ ఐక్యంగా పోరాడి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సుబ్బరాజు, పెంచలయ్య, కృష్ణయ్య, మాధవి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ హయాంలోనే మైనార్టీలకు పెద్దపీట'

లక్కిరెడ్డిపల్లె, జూలై18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ హయాంలోనే మైనార్టీలకు పెద్దపీట వేసినట్లు టీడీపీ మండల ఇన్‌చార్జి యనమల మదన్‌మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాలకు న్యాయం జరిగిందన్నారు. లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు ఏర్పటినప్పటి నుంచి ఇంతవరకు మార్కెట్ యార్డు పదవి మైనార్టీలకు ఇచ్చిన పాపన పోలేదన్నారు. అదే టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మైనార్టీలను గుర్తించి మార్కెట్ యార్డును ఎస్ఎండీ షఫీ నాయక్‌కు కట్టబెట్టడం అభినందనీయమన్నారు. మైనార్టీ సోదరులు ముస్తాక్ అహ్మద్, అన్వర్‌బాషా, మసూద్ పాల్గొన్నారు.

పేదల రక్తం పీల్చేందుకే స్మార్ట్ మీటర్లు: సీపీఎం

రాయచోటిటౌన్, జూలై18(ఆంధ్రజ్యోతి): పేదల రక్తం పీల్చేందుకే ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగిస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజులు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకించే కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం బోస్‌నగర్, సందీప్‌నగర్, దూదేకులపల్లి ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి విద్యుత్ స్మార్ట్ మీటర్ల ద్వారా పేదల మీద ప్రభుత్వం వేస్తున్న భారాలు, నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాధవయ్య, ఈశ్వరయ్య, రమణయ్య, చెన్నయ్య, కదిరయ్య, గంగులయ్య, ఓబులయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు పూజలు



ప్రత్యేక అలంకరణలో భువనేశ్వరీ దేవి

రైల్వేకోడూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భుజంగేశ్వర స్వామి ఆలయంలో వెలసిన భువనేశ్వరీ దేవికి శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు యోగి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకారంలో అమ్మవారు

ఒంటిమిట్ట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఒంటిమిట్టలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆషాడమాస ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు అమ్మవారి వడిబియ్యం, సారె సమర్పించారు. రాత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దశ హారతులతో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు సోమిశెట్టి మనోహర్‌బాబు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



శాకంబరి అలంకారంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

హాస్టళ్ల తనిఖీ



నీలకంఠ్రావుపేటలో హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారి విశ్వనాథ్

రామాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్సీ బాలికల వసతి గృహం, ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాలను శుక్రవారం రామాపురం మండల ప్రత్యేక అధికారి విశ్వనాథ్, ఎంపీడీవో జాషువా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు హాస్టళ్లను తనిఖీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వనితారెడ్డి, హాస్టల్ వార్డెన్ అనుపమ, కేజీబీవీ స్పెషలాఫీసర్ పుష్పలత, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

● ఎండోమెంట్ ఇన్‌చార్జి ఏవో మోహన్‌రెడ్డి



రంగనాథ ఆలయ ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న కూలీలు

సిద్దవటం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సిద్దవటంలో వెలసిన రంగనాథ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎండోమెంట్ ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఆయన ఆలయ ప్రాంగణంలో ఉన్న పిచ్చిమొక్కలను కూలీలతో తొలగించారు. అనంతరం మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి గతంలో మంజూరైన నిధులు రూ.34 లక్షలు పనులు చేపట్టక టీటీడీకి వెనక్కు వెళ్లిపోయాయన్నారు. తిరుపతికి వెళ్లి నిధులు మంజూరు చేయించుకుని ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎండోమెంట్ సిబ్బంది చంద్ర, కూన, విజయభాస్కర్, కూలీలు పాల్గొన్నారు.

సమన్యాయం పాటించండి : కే కే చౌదరి

పుల్లంపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) :రెవెన్యూ సమస్యల పట్ల సమన్యాయం పాటించాలని రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ చైర్మన్ కేకే చౌదరి, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు తహసీల్దారు పుల్లారెడ్డికి సూచించారు. శుక్రవారం పుల్లంపేటలో టీడీపీ కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయంపై వారు తహసీల్దారును కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికి ఒకే న్యాయం చేయాలని లేనిపక్షంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేకే చౌదరికి సన్మానం

రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరికి శుక్రవారం పుల్లంపేటలో చేనేత సంఘం నాయకులు చిన్నం శివయ్య సన్మానించారు. ఈ సందర్భంగా చేనేత సమస్యల గురించి చైర్మన్‌కు వివరించారు. మండల ఇన్‌చార్జి ఎ.సుధాకర్‌నాయుడు, మాజీ మండల అధ్యక్షుడు పోలూరు కృష్ణమనాయుడు, చుండు ఈశ్వరనాయుడు, మస్తాన్ పాల్గొన్నారు.

హాస్టల్‌లో అన్ని వసతులు కల్పించాలి

ఓబులవారిపల్లె, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : హాస్టల్‌లో అన్ని వసతులు కల్పించాలని తహసీల్దారు యామిని, ఎంపీడీవో మల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం వారు స్థానిక హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందించే అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

గాలివీడు, జూలై18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ కూడా అలవర్చుకోవాలని ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం రాత్రి మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ వసుధ గృహాలతో పాటు నూలివీడులోని ఎస్సీ వసతి గృహాలను పరిశీలించారు.కార్యక్రమంలో వార్డెన్లు రవిబాబు, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన ప్రత్యేకాధికారి

పెనగలూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పెనగలూరు ఎస్సీ బాలుర హాస్టల్‌ను గురువారం రాత్రి మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి సురేష్, హాస్టల్‌వార్డెన్ హరిక్రిష్ణ ఉన్నారు.


వాడీవేడిగా పుల్లంపేట మండల సర్వసభ్య సమావేశం



ఉపాధి అక్రమాలపై ఆధారాలు చూపిస్తున్న ఎంపీపీ

పుల్లంపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేట మండలంలో చేపట్టిన ఉపాధి పనుల్లో అవినీతి జరిగిందంటూ ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పుల్లంపేట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి అధ్యక్షతన వాడివేడిగా జరిగింది. ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ చైర్మన్ కేకే చౌదరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మండలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఉపాధి హామీ ఏపీవో శ్రీనివాసులు తమ శాఖ పనితీరు సభకు తెలియజేస్తుండగా ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని 22 పంచాయతీల్లో మూడు వేల మంది కూలీలు ఉండగా ఒక్క పంచాయతీలోనే 1200 మంది ఎలా పనిచేస్తారన్నారు. ఒకచోట పనిచేసి మూడు ఫొటోలు, మూడు మస్టర్లు ఒకే ఫొటోతో చేస్తున్నారని, ఇలా రోజుకు అధికంగా కూలీల పేరుతో డబ్బు స్వాహా చేస్తున్నారని ఆధారాలు సభ ముందు ఉంచారు. ఈ యేడాది రూ.63 లక్షల ఉపాధి పనులు దుర్వినియోగం అయ్యాయన్నారు. ఏపీవో శ్రీనివాసులను పదే పదే హెచ్చరించినా ఫలితం లేదన్నారు. విచారణ చేపట్టాలన్నారు. అలాగే దళిత వర్గానికి చెందిన ఎంపీటీసీ తన భూమిని ఆక్రమించారని ఫిర్యాదు చేసినా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదన్నారు. అలాగే దళిత వర్గానికి చెందిన ఎంపీటీసీ తన భూమిని ఆక్రమించారని ఫిర్యాదు చేసి చాలా కాలం అయినా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదన్నారు. 50 సెంట్ల భూమి కొని దాని హద్దులు చూపి న్యాయం చేయాలని తహసీల్దారును కోరితే కోర్టుకు పోయి తేల్చుకోమని చెప్పడాన్ని బట్టి చూస్తే పేదలకు న్యాయం జరగడంలేదని తహసీల్దారు పుల్లారెడ్డిపై ఎంపీపీ మండిపడ్డారు. తాను కొన్న భూమికి హద్దులు చూపాలని చలానా కడితే తనకే న్యాయం జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారం చేపట్టినప్పటి నుంచి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారన్నారు. రాబోయే నాలుగేళ్లలో ప్రభుత్వం ఏ కార్యక్రమాలు చేపట్టాలనే విషయాలపై ప్రణాళికలు తయారు చేస్తున్నారన్నారు. వైస్ ఎంపీపీలు జయ, వెంకటనరసమ్మ, ఏవో శ్రీధర్‌రెడ్డి, తహసీల్దారు పుల్లారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మంత్రి మండిపల్లిని కలిసిన మార్కెట్ చైర్మన్ అనుంపల్లి



మార్కెట్ కమిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, జూలై18(ఆంధ్రజ్యోతి):రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేరును ప్రకటించడంతో శుక్రవారం ఆయన రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి సత్కరించారు. పలువురు మాజీ సర్పంచులు, టీడీపీ నేతలతో కలిసి మంత్రి మండిపల్లి స్వగ్రామమైన బోరెడ్డిగారిపల్లెకు వెళ్లి కలిశారు. అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మంత్రి మండిపల్లి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

'నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి'

రైల్వేకోడూరు రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లతీఫ్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ అమర్నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం సాయంత్రం 6:30 వరకు క్లాసులు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థుల స్వేచ్ఛను హరిస్తున్న కళాశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి బాలాజీ, అధ్యక్షుడు మదన్ సాయి, ఉపాధ్యక్షుడు కార్తికేయ, పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

'పేదల ఆకలి తీరుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు'

రాయచోటిటౌన్, జూలై18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్‌ల ద్వారా పేదల ఆకలి తీరుస్తున్న అన్నదాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. శుక్రవారం ఆయన రాయచోటి పట్టణంలోని అన్న క్యాంటీన్‌ల వద్దకు వెళ్లి భోజన వసతులపై ఆరాతీశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రోషా, మల్లికార్జున, అమీర్‌బాషా, హైదర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


విషజ్వరాలపై స్పందించిన అధికారులు



వంతాటిపల్లెలో లార్వా పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

సిద్దవటం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విషజ్వరాలపై అధికారులు స్పందించారు. శుక్రవారం జ్యోతి, వంతాటిపల్లె, బందారుపల్లె కాలనీల్లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.కొత్తపల్లె వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విషజ్వరాలు సోకిన వారిని గుర్తించడానికి సర్వే నిర్వహించామన్నారు. అపరిశుభ్రత ప్రాంతాల్లో లార్వా పిచికారీ చేశామని, కళ్ల మంటలు, జలుబు, దగ్గు, తలనొప్పి విరేచనాలతో బాధపడే వారు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్సలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మౌలాలి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

మురుగు తొలగించాలని నిరసన



మురుగు నీటిలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సుండుపల్లె, జూలై18(ఆంధ్రజ్యోతి): మురికినీరు తొలగించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మస్తాన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పింఛా రహదారి వద్ద కెనరా బ్యాంకు ఎదురుగా గత కొన్ని సంవత్సరాల నుంచి వర్షపు నీరు, మురికినీరు నిల్వచేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మోకాళ్ల లోతు నీరు ఉండటంతో వాహనదారులు, ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

గాలివానకు నేలకూలిన చెట్లు



సుండుపల్లె, జూలై18(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండల వ్యాప్తంగా గురువారం రాత్రి వర్షం కురవడంతో రైతులకు కాస్త ఊరట లభించినట్లైంది. మండలంలో 76.4 మిల్లీ మీటర్, పింఛా ప్రాజెక్టుల పరిసర ప్రాంతాల్లో 71.2 మిల్లీమీటర్ల వర్షం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. తిమ్మసముద్రం వంకపొరడంతో అంగన్వాడీ కేంద్రంలో నీరు చేరింది. అంగన్వాడీ కేంద్రంలోని బియ్యం, నిత్యావసర సరుకులు జలమయమయ్యాయి.

మృతదేహానికి టీడీపీ నేతల నివాళి

పెనగలూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ముస్లిం మైనార్టీ సీనియర్ నాయకుడు షేక్ ఖలీల్‌బాషా(72) శుక్రవారం ఉదయం ఆకస్మాత్తుగా మృతిచెందారు. ఆయన మృతదేహానికి టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, ఖాదీ గ్రామీణాభివృద్ధిశాఖ చైర్మన్ కేకే చౌదరి, ఏఎంసీ మాజీ చైర్మన్ విశ్వేశ్వర్‌నాయుడు నివాళులర్పించారు.

కొనేవారు లేకపోవడంతో తోతాపురి మామిడి కాయలు తోటల్లోనే మాగిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఏదో ఒక ధర చెల్లించి కాయలు తీసుకోవాలని రైతులు వ్యాపారులను, కమీషన్ ఏజెంట్లను కోరుతుండగా, అయితే రైతు వద్ద ఏ ధరకు కొనాలి, తాము ఏ ధరకు అమ్ముకోవాలి, కనీసం కోత కూలీల ఖర్చుకు సరిపోయేంత మొత్తమైనా ఇవ్వక పోతే ఎలాగన్న ఆలోచనతో కమీషన్ ఏజెంట్లు కూడా కాయల కొనుగోలుకు వెనుకంజ వేస్తున్నారు. ఏమిచ్చినా పర్వాలేదని రైతులు బతిమలాడుకుంటున్నా మొహమాటంతో వ్యాపారులు మొహం చాటేస్తున్నారు. ఒక్కోసారి ఏం ఇవ్వాలో మీరే చెప్పండని రైతులను కోరుతున్నారు. కోతలు, రవాణా చార్జీలు ఇతర ఖర్చులను బేరీజు వేసుకుని ఏం అడగాలో అర్థం కాక రైతులు, ఏమివ్వాలో తెలియక ఏజెంట్లు ఎవరిదారిన వారు మౌనంగా వెళ్లిపోతున్నారు.



తూర్పుపల్లె వద్ద తోటల్లో చెట్లకే మాగిపోతున్న తోతాపురి మామిడికాయలు



చెట్లకింద మాగి రాలిపోయిన పండ్లు

- ఆగస్టు దాకా ఆగండి : ప్రభుత్వం
- ఆగితే ఆగమైపోతాం : రైతులు
- చెట్ల పైనే మాగి, రాలిపోతున్న మామిడికాయలు
- సందిగ్ధంలో మొహం చాటేస్తున్న కమీషన్ ఏజెంట్లు

తోటల్లోనే.. తోతాపురి

పెనగలూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తోతాపురి రకం మామిడి కాయలకు ప్రభుత్వం 8 రూపాయలు గిట్టుబాటు ధర కల్పించినా, కాయ కోతల్లో మార్పు రాలేదు. రైతులు తొందరపడి కాయలు కోయవద్దని, ఆగస్టు నెలాఖరుదాకా ఉంచుకోవాలని ప్రభుత్వం చెబుతున్నా ఇప్పటికే సగం కాయలు పండుమాగి రాలిపోవడంతో, ఇంకా 45 రోజులు కాయలు చెట్లమీద ఉంటాయా అని రైతులు నిట్టూరుస్తున్నారు. ఇంకో వారం రోజులుంటే ఏ కాయలైనా పూర్తిగా మాగి రాలిపోయే పరిస్థితులు మెండుగా కనిపిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ఆగస్టు చివరిదాకా ఏ రైతు మాత్రం ఆగి ఏం చేయగలడని అంటున్నారు. ప్రభుత్వం ఫ్యాక్టరీ యజమానులతో మాట్లాడి కాయలు తీసుకునే విధంగా ఒప్పిస్తే చాలు అని రైతులు కోరుతున్నారు. ఈ ఏడు ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల మండలంలో 20 శాతం కంటే ఎక్కువగా కాపు లేదు. ఆ కాస్త కాపులోనే ఇప్పటికే సగం మాగిపోయి రాలిపోగా, మిగిలిన కాయలైనా గిట్టుబాటు ధరకు అమ్ముకుంటే కనీసం చెట్ల కింద కుళ్లిపోయిన కాయలైనా లేకుండా పోతాయని అంటున్నారు. ఈ ఏడు కనిపించిన పరిస్థితులను బట్టి చూస్తే వచ్చే ఏడు రైతులు తోటల్లో సస్యరక్షణ చర్యలు కూడా చేపట్టే పరిస్థితులు కనిపించడంలేదు. మామిడి తోటలను సాగు చేసి దివాళా తీసే పరిస్థితులు పగవాడికైనా రాకూడదని రైతులు భావిస్తున్నారు.

ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించింది



బాగా నష్టపోయిన మామిడి రైతుల దుస్థితిని ప్రభుత్వం పరిశీలించింది. వారిని ఆదుకునేందుకు గత నెలలో కిలోకు రూ.4 సబ్సిడీ ఇచ్చి, కాయలు కొనుగోలుకు వంద కోట్లు మంజూరు చేసింది. ఈ నెలలో మరలా కిలోకు 8 రూపాయలు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకునేందుకు ముందుకు వచ్చింది. గతంలో ఇంతకంటే ఏ ప్రభుత్వం మామిడి రైతులకు సబ్సిడీ ఇచ్చి గిట్టుబాటు ధర కల్పించలేదు. కూటమి ప్రభుత్వం రైతుల కోసం మద్దతు ధర ప్రకటించింది.

-పెరుగు కృష్ణయ్యానాయుడు, రైతు సంఘం నేత

పల్ప్ ఎగుమతులు పడిపోయాయి



పల్ప్ ఎగుమతులు నిలిచిపోవడంతో మామిడికాయల కొనుగోలుకు ఫ్యాక్టరీ యజమానులు మొగ్గు చూపడంలేదు. కమీషన్ ఏజెంట్ల ఒత్తిడి తట్టుకోలేక రైతుల నుంచి సేకరించే కాయలను ఫ్యాక్టరీకి తెమ్మంటున్నారు. కాయలు కొనుగోలు చేసినందున వచ్చే కాస్తో కూస్తో డబ్బులైనా ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వం చొరవ చూసుకుని పల్ప్ ఎగుమతులకు చర్యలు తీసుకుంటే రైతులను ఆదుకోవచ్చు.

- పుచ్చకాయల లక్ష్మీనరసయ్య, కమీషన్ వ్యాపారి

పారిశుధ్యంపై శ్రద్ధ చూపండి : ఆర్డీవో

గుర్రంకొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. మండలంలోని రామాపురం డంపింగ్ యార్డును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ డంపింగ్ యార్డు నిర్మాణ విషయమై వివాదం కోర్టులో ఉంది. ఇందుకు సంబంధించిన వివరాలను నాయకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పారిశుధ్యం నిర్వహణను తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికుడితో మాట్లాడి వేతనాలు అందుతున్నాయా, నెలకు ఎంత వేతం వస్తుందన్న వివరాలను తెలుసుకున్నారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ సదాశివప్పనాయుడు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికుడితో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

మహిళా సమాఖ్య లావాదేవీలపై ఆడిట్

మదనపల్లె టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండల మహిళా సమాఖ్యలో ఏడాది పాటు నిర్వహించిన రూ.140 కోట్ల లావాదేవీలపై ఆడిట్ అధికారులు పరిశీలన ప్రారంభించారు. శుక్రవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆడిటర్ ఎం.రాజ శేఖర్ ఆధ్వర్యంలో నలుగురు సభ్యులు ఆడిట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏరియా కోఆర్డినేటర్ సాంబశివ మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు మదనపల్లె మండ లంలోని 76 గ్రామ సమాఖ్యల రుణాలు, బ్యాంకు లింకేజీలు, స్త్రీ నిధి రుణాలకు సంబంధించి చెల్లింపులు, రికవరీలు, ఖర్చులపై ఆడిట్ జరుగుతోందన్నారు. కొత్త రుణాలపై ఎస్ హెచ్‌జీ సభ్యుల తీర్మానాలు పరిశీలిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ బృందం సభ్యులు విజయ్‌కాంత్, గిరికుమార్‌రెడ్డి, డీఎంజీ గంగాధర్, సీసీలు, సంఘమిత్ర తదితరులు పాల్గొన్నారు.



మహిళా సమాఖ్య లావాదేవీలను తనిఖీ చేస్తున్న ఆడిటర్లు, అధికారులు

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

మదనపల్లె అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మదనపల్లె పట్టణం, కనకదాస్‌నగర్‌కు చెందిన మల్లయ్య కుమారుడు వెంకటరమణ నాయుడు (50) స్థానిక నీరుగట్టువారిపల్లెలోని టమోటా మార్కెట్‌లో దినసరి కూలీగా పని చేస్తుంటాడు. గురువారం రాత్రి పని ముగించుకుని నడుచుకొంటూ ఇంటికి వెళుతుండగా చౌడేశ్వరీ కళ్యాణమండపం వెనుకవైపు జాతీయ రహదారిలో గుర్తుతెలియని వాహనం ఢీనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెంటనే తమ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని మృతలదేహాన్ని పరిశీలించి, అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. టూటౌన్ సీఐ రామచంద్ర కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య కళావతి, కుమార్తె ప్రసన్నలక్ష్మి, సాయి కుమార్, మణికంఠ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

సుండుపల్లె, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తగిలి జగన్నాథం చందు (20) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం సమీపంలో నూతన గృహానికి స్లాబ్ వేసేందుకు వచ్చిన రాయచోటి రాయుడుకాలనీకి చెందిన జగన్నాథం చందు విద్యుదాఘాతంతో మిద్దె మీద నుంచి పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

మదనపల్లె అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బి.కొత్తకోట మండలం, ఎగువ శీతోలపల్లెకు చెందిన సిద్దారెడ్డి కుమారుడు ఎం. వెంకటరమణారెడ్డి (52)ని గత నెల 26న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న వృద్ధుడు శుక్రవారం మృతిచెందాడు. ఈ మేరకు మొలకలచెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్

వీరబల్లి, జూలై18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీరబల్లి అటవీ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లర్‌ను అరెస్టు చేయడంతో పాటు మూడు దుంగలు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలియజేశారు. టాస్క్ ఫోర్స్ ఆర్ఎస్ఐ నరేశ్ టీం స్థానిక ఎస్పీవో అనిల్‌కుమార్‌తో కలిసి శుక్రవారం వీరబల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో కూంబింగ్ చేస్తుండగా అయ్యాలవారిపల్లె వద్ద ఒక వ్యక్తి మోటార్ సైకిల్ మీద నిలుచుని కనిపించాడు. దీంతో వారు అక్కడికి వెళ్లగా అతను మోటారు సైకిల్ వదిలి పారిపోయేందుకు ప్రయత్నించాడు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు అతనిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారణ చేయగా తిరుపతి జిల్లాకు చెందిన వ్యక్తిగా తేలింది. దీంతో అతన్ని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ సీఐ సురేశ్‌కుమార్ తెలిపారు.

కారును ఢీకొన్న బస్సు : ఐదుగురికి గాయాలు



కారును ఢీ కొట్టిన ప్రైవేట్ బస్సు

మదనపల్లె అర్బన్, జూలై 18(ఆంధ్ర జ్యోతి): కారును ప్రైవేటు బస్సు ఢీకొనడంతో ఐదుగురికి గాయాలయ్యాయని ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పీలేరు పట్టణానికి చెందిన తరుణ్(24), ఆసీఫ్(23), నిఖిల్(22), బాలాజీ (25), ప్రేమ కుమార్ (24) గురువారం రాత్రి పీలేరు నుంచి కారులో మదనపల్లెకు వస్తుండగా పోతబోలు నుంచి మదనపల్లెకు వస్తున్న ప్రైవేట్ బస్సు తట్టివారిపల్లె వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారందరికీ వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి, పీలేరు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

విశ్రాంత ఉద్యోగి వాహనంపై దాడి



స్థానిక పోలీసు స్టేషన్‌లో ఉన్న విశ్రాంత ఏఈ వాహనం

సిద్దవటం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలను మనసులో ఉంచుకుని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ తన వాహనంపై రాయితో దాడి చేశాడంటూ పంచాయతీరాజ్ విశ్రాంత ఏఈ సుబ్రమణ్యం శుక్రవారం పోలీసు లకు ఫిర్యాదు చేశాడు. ఒంటిమిట్టలో పంచాయతీరాజ్ ఏఈగా విధులు నిర్వహిస్తున్నప్పుడు గంగపేరూరు సచివాలయంలో నిందితుడు దీపు విధులు నిర్వహించేవాడని, మెజర్‌మెంట్ బిల్లులకు సంబంధించిన రికార్డుల విషయంలో తనపై కక్ష గట్టి తన వాహనంపై దాడి చేశాడని తెలిపాడు. ఈ ఫిర్యాదు పై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- మందులు అందుబాటులో ఉంచుకోవాలి
- గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి
- సబ్ కలెక్టరు మేఘస్వరూప్



తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి, సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టరు మేఘస్వరూప్

తంబళ్లపల్లె, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలందించాలని మదనపల్లె సబ్ కలెక్టరు మేఘస్వరూప్ ఆదేశించారు. శుక్రవారం ఆయన తంబళ్లపల్లె మండలంలో ముమ్మరంగా పర్యటించారు. ప్రభుత్వాసుపత్రిలోని ల్యాబ్, బాలింతల వార్డు, ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే, ఓపీని పరిశీలించారు. ఆసుపత్రి నిర్వహణ, పరిశుభ్రత, పారిశుధ్యం, ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, మందుల స్టాకు, వైద్యులు, సిబ్బంది కొరత, ఓపీ, సమస్యలు తదితర వివరాలను వైద్యాధికారి తేజశ్వినిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది ఆసుపత్రిలో అందుబాటులో ఉండడంతోపాటు, రోగులతో స్నేహభావంతో మెలుగుతూ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం ఎర్రసానిపల్లె, గోపిదిన్నె సంపద సృష్టి కేంద్రాలను తనిఖీ చేశారు. గోపిదిన్నెలో చెత్త సేకరించడం లేదంటూ ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు వెళ్లిందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సేకరించిన చెత్తను బృందావనాలకు తరలిస్తున్నారా.? లేదా.? బృందావనంలో తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువులు తయారు చేస్తున్నారా.? లేదా వంటి విషయాలను పరిశీలించారు. ప్రతి బృందావనంలో చెత్త నుంచి ఎరువులను తయారు చేసి స్థానిక రైతులకు విక్రయించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఎరువులను విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. తడి, పొడి చెత్త సేకరణ సక్రమంగా జరిగే విధంగా గ్రామ కార్యదర్శులు చర్యలు తీసుకునేలా చూడాలని ఎంపీడీవోను ఆదేశించారు.. ఆయన వెంట నియోజకవర్గ ప్రత్యేకాధికారి అమర్‌నాథరెడ్డి, తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో థామస్‌రాజ, ఎంఈవో త్యాగరాజు, వైద్యాధికారి తేజశ్విని, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

- ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీ



ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులు

మదనపల్లెటౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కల్యాణదుర్గం ఏడీఏ ఎల్లప్ప హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాలను విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్, వ్యవసాయశాఖ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉంచుకోవాలని, ఎమ్మార్పీ ధరలకే యూరియా విక్రయించాలన్నారు. భూమి పత్రాల ప్రకారం, ఆధార్ కార్డులున్న రైతులకే ఎరువులు విక్రయించాలన్నారు. క్రిమి సంహారిణిలు, విత్తనాల విక్రయాల్లో తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. అనంతరం పట్టణంలోని ఐమాక్స్ ఫర్టిలైజర్స్, రైతుమిత్ర, ప్రసాద్ ఆగ్రో, కిసాన్ అగ్రిమాల్ దుకాణాలను తనిఖీ చేశారు. కిసాన్ అగ్రిమార్ట్‌లో రూ1.14లక్షల విలువైన అనుమ తులు లేని క్రిమిసంహారిణిని సీజ్ చేశారు. కార్యక్రమంలో మదనపల్లె ఏఓ నవీన్ కుమార్‌రెడ్డి, జేడీఏ కార్యాలయం ఏఓ టి.పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ షెడ్ పనులు సద్వినియోగం చేసుకోండి

పెద్దతిప్పసముద్రం జూలై 18 (ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రంగసముద్రం వాటర్ షెడ్ చైర్మన్ సుబ్రమణ్యం రైతులకు సూచించారు. సంపతికోట ప్రాజెక్టు రంగసముద్రం మైక్రో వాటర్‌షెడ్‌లో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఆరు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు కింద వాటర్ షెడ్ పనులు చేసు_న్నామన్నారు. రంగసముద్రం గ్రామంలో పనులకు "సుమారు రూ 2 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, రైతులకు ఉపయోగపడే పనులైన నీటి నిల్వ పనులు, చిన్న ఊటకుం టలు, పెద్ద ఊట కుంటలు, చెక్ డ్యాంలు, డకౌట్ ఫారంపాండ్‌లు, ఏర్పాటు చేసుకుంటే భూగర్భ జలాలు పెంపొందుతాయన్నారు. గ్రామాల్లో రైతులందరూ సమన్వయంతో పనులు చేపడితే ఉప యోగకరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నిర్దేశిం న సబ్సిడీ ధరలకు రైతులకు వ్యవసాయ పరికరాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అధికారి వెంకటరమణ, ఐసీబీ అధికారి మేఘనాథ్, రైతులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



రోడ్డుప్రమాదంలో గాయపడిన యువకుడు

బి.కొత్తకోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలైన సంఘటన శుక్రవారం వేకువ ఝామున బి.కొత్తకోట మండల సరిహద్దు గౌనిపల్లె మార్గంలో జరిగింది. బి.కొత్తకోటకు చెందిన హేమంత్‌కుమార్(32) ద్విచక్ర వాహనంలో గౌనిపల్లి వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబీ కులు క్షతగాత్రుడిని మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతను చికిత్స పొందుతున్నాడు.

ఘర్షణలో ఒకరికి తీవ్రగాయాలు

నిమ్మనపల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): డబ్బు విషయంలో జరిగిన ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రెడ్డివారిపల్లి పంచాయతీ బాలేవాండ్లపల్లికు చెందిన హరిబాబు అదే గ్రామానికి చెందిన ఈశ్వర వద్ద రూ.4వేలు అప్పుగా తీసుకున్నాడు. రుణం చెల్లించేందుకు హరిబాబు నిరాకరించడంతో ఈశ్వర కట్టెతో దాడి చేశాడు. దీంతో గాయపడిన వ్యక్తిని స్థానికులు మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈశ్వర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పబ్లిసిటీ బోర్డులపై రెవెన్యూ అధికారుల సర్వే



బెంగళూరు రోడ్డులోని డెయిరీ వద్ద సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

మదనపల్లె, అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో వెంచర్లకు సంబంధించిన పబ్లిసిటీ బోర్డులను శుక్రవారం రెవెన్యూ , ఆర్అండ్‌బీ అధికారుల సమక్షంలో మదనపల్లె మండల సర్వేయర్ సుబ్రమణ్యం, ఆర్ఐ బాలసుబ్రమణ్యం తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న రికార్డుల మేరకు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బెంగళూరు రోడ్డులో పబ్లిసిటీటీ బోర్డుల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందన్నారు. వెంటనే పబ్లిసిటీ బోర్డులను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. ఈ సర్వేలో ఆర్ఐ బాల, వీర్వోలు సంధ్యారాణి, మండల సర్వేయర్ సుబ్రమణ్యం, సచివాలయ సర్వేయర్ సురేష్, ఆర్అండ్‌బీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యాదవుల పాదయాత్రకు బీసీ హక్కుల పోరాట సమితి మద్దతు



మాట్లాడుతున్న బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్

మదనపల్లె అర్బన్, జూలై 18(ఆంధ్ర జ్యోతి): యాదవులు శాంతియుత పాదయాత్రకు బీసీ హక్కుల పోరాట సమితి మద్దతు ఇస్తున్నట్లు ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1960లో ఇండియా, చైనా మధ్య జరిగిన యుద్ధంలో భారతదేశానికి చెందిన అమరు లైన యాదవుల పేరును మిలటరీ బెటాలియన్‌కు పెట్టాలని డిమాండ్ చేస్తూ కాశీ నుంచి కన్యాకుమారి మీదుగా ఢిల్లీకి శాంతియుత పాదయాత్ర చేస్తున్న యాదవులకు తమ మద్దతు ప్రకటించినట్లు రాజశేఖర్ చెప్పారు. అ సమయంలో అక్కడ స్మారచిహ్నం ఏర్పాటు చేశారని, అనంతరం యాదవఅల పేరును మిటలరీ బెటాలియన్‌కు పెడతామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. తరువాత ఆ పేరు పెట్టలేదని, దీంతో ఆ సామాజిక వర్గానికి చెందిన కొందరు నాయకులు మిలటరీ బెటాలియన్‌కు యాద వుల పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21న సోమవారం మదనపల్లె పట్టణంలోని అమ్మచెరువు మిట్ట వద్ద ఈ పాదయాత్ర బృందానికి స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమలో బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు, బీసీలుపాల్గొనాలని పిలుపునిచ్చారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాజంపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం రాజంపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నల్లబ్యాడ్జీలు కళ్లకు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన కోర్కెల కోసం సమ్మె చేస్తున్నారన్నారు. 17 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు అయినా లేకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్ నాయకులు పీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

'వాల్టా'కు తూట్లు..

- పట్టపగలే అక్రమంగా తరలిపోతున్న కలప
- అంతరించిపోతున్న వృక్షసంపద
- పర్యావరణానికి ముంచుకొస్తున్న ముప్పు
- దృష్టి సారించని అటవీ శాఖ అధికారులు



పట్టపగలే యథేచ్ఛగా ట్రాక్టర్లలో తరలిపోతున్న వృక్షసంపద

పెద్దతిప్పసముద్రం జూలై 18 (ఆంధ్రజ్యోతి): వృక్ష సంపద నానాటికి అంతరించి పోతుండ డంతో వాతావరణంలో పెనుమార్పులు సంభవిస్తున్నాయని, పర్యావరణ నిపుణులు వాపోతుం డగా, విరివిగా మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రభు త్వాలు ఘోషిస్తున్నాయి. అయినా, వృక్షాల నరికివేత మాత్రం ఆగడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా వృక్షాలను నరికేసి వాటిని పట్టపగలే సరిహద్దు రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుం టున్నా పట్టించు కునే నాథులు కరువయ్యారు.

పెద్దతిప్పసముద్రం మండలంలోని మడుమూ రు, రాపూరివాండ్లపల్లె, కాట్నగల్లు, పట్టెం వాండ్లపల్లె, పులికల్లు, టి.సదుం, తుమ్మరకుంట, మల్లెల, బూచిపల్లె, సంపతికోట గ్రామాల్లోని చెట్లను కొందరు వ్యాపారులు అక్రమంగా నరికేసి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారం తెలిసినా పోలీసులు మిన్నకుండి పోతుండడంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి రోజూ నాలుగైదు ట్రాక్టర్లలో కలప దుంగలను అక్రమంగా తరలించుకు పోతున్నారు.

రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే..

కొందరు స్థానిక నాయకుల అండదండలతో రెవెన్యూ అధికారులు వృక్షాల నరికివేతకు అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.తమ పొలంలోని వృక్షాలను నరికివేసేందుకు అనుమతిం చాలంటూ రైతులతో రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు తీసుకుని, దగ్గరుండి మరీ వృక్షాలను నరికించి కలపను తరలించుకుని పోతున్నారు. అధికారులకు ప్రతి నెల మామూళ్లు అందుతుండడంతోనే చెట్ల నరికివేత, తరలింపు మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోందని, దీని కారణంగా మండలంలో వృక్ష సంపద రోజురోజుకు అంతరించి పోయే ప్రమాదం ఏర్పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అటవీ శాఖ బీట్ అధికారి షాబీనా తాజ్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా చెట్లను అక్రమంగా నరికి తరలిస్తున్న విషయం తమ దృష్టికి రాలేదని, ఎవరైనా అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్‌లో మొండి బకాయిలు

- రూ.13.58 కోట్లు అప్పులు
- రికవరీపై ప్రభుత్వం దృష్టి
- బకాయిదారులకు నోటీసులు
- కొత్తరుణాల మంజూరుకు నిధులు కోసమేనా..?

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్‌లో మొండిబకాయిలు పేరుకుపోతున్నాయి. ప్రభుత్వాలు ఇస్తున్న నిధుల ద్వారా ఎస్సీల్లోని అర్హులకు రుణాలు అందించి ఆ సామాజిక వర్గం ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా చర్యలు చేప డుతున్నారు. అయితే రుణాలు పొందిన లబ్ధిదారులు తిరిగి సకాలంలో చెల్లించకపోవడంతో ఎస్సీ కార్పొరేషన్ నిధులు లేమితో కొట్టుమి ట్టాడు తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకపోవడంతో కార్పొరేషన్ నిర్వీర్యం అయిపోయింది. ఉన్న పథకాలను కూడా అటకెక్కించి ఐదేళ్ల పాటు ఎస్సీలకు తీవ్ర అన్యాయం చేశారు. ఇదిలా ఉండగా 2014-19 సంవత్సరాల మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీల్లోని అర్హులైన వారికి రుణాలు అందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఈ రుణాలు పొందిన వారు తిరిగి చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తిరిగి కూటమి ప్రభుత్వం అధి కారంలోకి రావడంతో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉపాధి రుణాలను అందిం చేందకు దరఖాస్తులను కూడా స్వీకరించడం జరిగింది. కానీ వివిధ కారణాలతో దరఖాస్తుల ప్రక్రియను మధ్యలోనే నిలిపివేయడంతో రుణా ల మంజూరు కూడా ప్రశ్నార్థకంగా మారుతుంది.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని అర్హులైన ఎస్సీ లకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఎన్ఎస్ఎఫ్‌డీసీ నిధుల ద్వారా 500 యూనిట్లకు 17 కోట్ల 22 లక్షల 44,554 రూపాయలు వివిధ ఉపాధి అవకాశాలు కోసం రుణాలు అందించారు. ఇందులో రవాణా సెక్టారు కింద 68 మందికి ఇన్నోవాకార్లు, 35 మందికి ఇథియోస్‌కార్లను ఇచ్చారు. నాన్ ట్రాన్స్‌పోర్టు సెక్టారు కింద 266 మందికి స్వయం ఉపాధి పథకా లను, మరో 77 మందికి ఆటోలు లాంటివి ఇచ్చారు. 54 మందికి భూమి కొను గోలు పథకం కింద 3 కోట్ల 201,66 వేల రూపాయలు రుణంగా అందించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వకపోవడంతో రుణాలు ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో ఎస్సీ కార్పొరేషన్ వైపు కన్నెత్తి చూసిన వారు కూడా కనిపించని పరిస్థితి. ఈ క్రమంలో రుణాల రికవరీపై కూడా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు సిబ్బంది పెద్దగా దృష్టి పెట్టకపోవడంతో మొండి బకాయిలు పేరుకుపోయాయి.



రుణాలు చెల్లించి సహకరించండి

ఎస్సీ కార్పొరేషను ద్వారా స్వయం ఉపాధి కల్పన రుణాలు పొందిన లబ్ధిదారులు తిరిగి రుణాలను చెల్లించి సంస్థ అభివృద్ధికి తోడ్పడడంతో పాటు ఎస్సీ సామాజిక వర్గంలోని మరికొంత మంది అర్హుల ఆర్థికాభివృద్ధికి సహకరించాలి.
-డాక్టర్ జి.రాజ్యలక్ష్మి, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

రుణాలు రాబట్టేందుకు...

ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకం కింద ఇచ్చిన రుణాల్లో రూ.13.58 కోట్ల బకాయిలు నిల్వ ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో ఇన్నోవా కార్ల పొందిన వారు ఐదు కోట్ల మూడు లక్షలా 42వేల 750 రూపాయలు, ఇతియోస్ కార్లకు సంబంధించి 86 లక్షల రూపాయలు, నాన్ ట్రాన్స్‌పోర్టు సెక్టారు కింద పొందిన రుణాలకు సంబంధించి రూ.3.51 కోట్ల బకాయిలు ఉన్నాయి. అదే విధంగా భూమి కొనుగోలు పథకం కింద 54 మందికి రూ.3.21 కోట్లు ఖర్చు చేస్తే ఒక్క రూపాయి కూడా తిరిగిరాని పరిస్థితి. దాదాపు వీరిలో చాల మంది రుణాలు చెల్లించాల్సిన గడువు కూడా తీరిపోయింది. దీంతో వీరి నుంచి రుణాలు రాబట్టేందుకు అధికారులు సమాయత్త మవుతున్నారు. లబ్ధిదారుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడి రుణాల వసూళ్లపై దృష్టి పెడుతున్నారు. రుణ బకాయదారులకు నోటీసులు కూడా జారీ చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది రుణాల వసూళ్లను వేగవంతం చేస్తున్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు డాక్టర్ జి.రాజ్యలక్ష్మి సిబ్బందికి రుణ వసూళ్లపై దిశా నిర్దేశం చేస్తూ రుణాల వసూళ్లపై దృష్టి సారిస్తున్నారు.



రుణ గ్రహీతతో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ అధికారులు

కొత్తరుణాల మంజూరు కోసమేనా...

పాత రుణాలు వసూలు అయితే కొత్తవారికి తిరిగి రుణాలు ఇచ్చే పరిస్థితి ఉంటుందని.. ఇందుకోసమే రుణ బకాయిలపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఐదేళ్లపాటు రుణాల కోసం ఎదురు చూసిన ఎస్సీ సామాజిక వర్గ ప్రజలు వైసీపీ ప్రభుత్వంలో నిధులు కేటాయించకపోవడంతో విసిగిపోయారు. ఈ తరుణంలో జిల్లా అధి కార యంత్రాంగంతో పాటు కలెక్టరు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎస్సీ కార్పొరేషన్ బలోపేతానికి పాత బకాయిలు వసూళ్లే కాకుండా మరిన్ని నిధులు ఇచ్చి మెరుగైన ఉపా ధి అవకాశాలు కల్పించా లని ఎస్సీ సామాజిక వర్గ ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

'తెలంగాణ అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలి'

వేంపల్లె, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిపై తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కాంగ్రెస్ పార్టీముఖ్య అధికారి తులసిరెడ్డి ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం అడ్డుపడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పడం సమంజసం కాదన్నారు. కృష్ణానదిపై తెలంగాణ ప్రభుత్వం బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు లేకుండా, ఎవరి ఆమోదం లేకుండా 90 టీఎంసీల సామర్థ్యం పాలమూరు-రంగారెడ్డి, 30టీఎంసీల సామర్థ్యంతో డిండి ఎత్తిపోతల పథకాలను నిర్మిస్తోందని.. వీటిని అడ్డుకో వాలని సలహా ఇచ్చారు. హంద్రీనీవా విషయంలో కాంగ్రెస్ పార్టీ కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి పనిచేయగా టీడీపీ ప్రభుత్వం చేసి నట్లు చెప్పుకోవడం శోచనీయమన్నారు. ఖర్చుపెట్టిన గణాంకాలు పరిశీలిస్తే ఎవరు ప్రాజెక్టులకు నిధులు ఖర్చుపెట్టిన విషయం తెలుస్తుందన్నారు.

పిడుగుపాటు బాధితునికి రూ.4 లక్షలు విడుదల

కలికిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దాదాపు మూడేళ్ల క్రితం పిడుగుపాటుకు గురై మృత్యువాత పడిన ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి చెందిన రైతు మల్‌రెడ్డి వీరారెడ్డి కుమారుడు నాగిరెడ్డి కుటుంబానికి రూ.4 లక్షలు విడుదల చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2022 అక్టోబరు 19వ తేదీ పిడుగుపాటుకు గురైన నాగిరెడ్డి మరణించాడు. అప్పటి ప్రభుత్వం బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించి ఊరట కల్పించి ఆదుకోవాల్సి వున్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. తాజాగా కడప కలెక్టరు ఈ దుర్ఘటనకు సంబంధించిన నివేదికను ఈ నెల 5న ప్రభుత్వానికి నివేదించారు. ఇందుకు ప్రభుత్వం తక్షణం స్పందించి శుక్రవారం పరిహారం నిధులు విడుదల చేసింది. వెంటనే డీబీటీ పద్ధతిలో బాధిత కుటుంబం బ్యాంకు ఖాతాలోకి రూ.4లక్షలు జమ చేయాలని కలెక్టరును ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

జేబీ ఆసుపత్రిలో ట్యూమర్ ప్రాస్తెసిస్ ఆపరేషన్ విజయవంతం

కడప సెవెన్ రోడ్స్ జూలై 18 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని జేబీ ఆసుపత్రిలో శుక్రవారం ఓ మహిళకు ట్యూమర్ ప్రొస్తేసిస్ ఆపరేషన్‌ను విజయవంతంగా చేసినట్లు ఎండీ డాక్టర్ జయ భారతి తెలిపారు. ఆమె వివరాల మేరకు.. చాగలమర్రి నివాసి అయిన మహబూబ్‌చాన్ అనే మహిళ మోకాలు ఆపరేషన్ చేయించుకొని చీముపట్టి నడవ లేనిస్థితిలో జేబీ ఆసుపత్రికి వచ్చింది. డాక్టర్ జహంగీర్ బాష పరీక్షించి ఆ ఎముక పూర్తిగా పాడైం దని దానిప్లేస్‌లో ఆపరేషన్ చేయాలని తెలిపారు. పేషెంట్ 120 కేజీలు ఉండడం వలన ఆపరేషన్ కష్టమైందని, ఉన్న ఎముక పూర్తిగా చెడిపోవడంతో కనీసం 2 సెంటీమీటర్ల ఎముకను తీసేసి దాని స్థానంలో ఇంప్లాంట్ అమర్చాల్సిన అవసరం ఉందని తెలిపారు. హైదరాబాద్ నుంచి ట్యూమర్ ప్రొస్తసిస్ తెప్పించి ఆపరేషన్ చేసి పేషెంట్‌ను మరుసటి రోజు నడిపించారు. దీంతో ఎవరూ తమకు ఆపరేషన్ చేసి నడిపిస్తామని నమ్మకం కలిగించ లేదని.. డాక్టర్ జహంగీర్ బాష నమ్మకాన్ని కలిగించడంతో మేము ఆపరేషన్ చేయిం చుకున్నామని, ఇపుడు బాగా నడుస్తున్నానని పేషెంట్ తన ఆనందాన్ని వ్యక్తపరిచారు.



పేషెంట్‌ను నడిపిస్తున్న డాక్టర్ జహంగీర్‌బాషా

గాలివానకు నేలకూలిన చెట్లు

సుండుపల్లె, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండల వ్యాప్తంగా గురువారం రాత్రి వర్షం కురవడంతో రైతులకు కాస్త ఊరట లభించినట్లైంది. మండలంలో 76.4 మిల్లీ మీటర్, పింఛా ప్రాజెక్టుల పరిసర ప్రాంతాల్లో 71.2 మిల్లీమీటర్ల వర్షం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. తిమ్మసముద్రం వంకపొరడంతో అంగన్వాడీ కేంద్రంలో నీరు చేరింది. అంగన్వాడీ కేంద్రంలోని బియ్యం, నిత్యావసర సరుకులు జల మయమయ్యాయి.

డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె ఆగదు



ప్రొద్దుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రొద్దుటూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులతో పాటు పారిశుధ్య కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చే వరకు సమ్మె ఆగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యం , మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చంటి, సాల్మన్, విజయ్‌కుమార్, రాఘవలు స్పష్టం చేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారంతో ఆరవ రోజుకు, పారిశుధ్య కార్మికుల సమ్మె మూడో రోజుకు చేరుకుంది. దీంతో పట్టణంలో పారిశుధ్య సేవలతో పాటు వాటర్ వర్క్సు, ఇంజనీరింగ్ సేవలకు అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి గురువారం కార్మిక సంఘాల నాయకులతో జరిపిన చర్చలతో కార్మికులు పారిశుధ్య సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లు అర్థం చేసుకునేలా మున్సిపల్ కార్మికులు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. మున్సిపల్ ఇంజనీరింగ్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మెకు మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మెన్లు బంగారు మునిరెడ్డి, కౌన్సిలర్లు వంశీ మద్దతు తెలిపారు.

నకిలీ ఈ-స్టాంపుల స్కాంలో ఇద్దరిపై కేసు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి

పోరుమామిళ్ల, జూలై 18(ఆంధ్రజ్యోతి): నకిలీ ఈ-స్టాంపుల స్కాంలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండా రెడ్డి తెలిపారు. శుక్రవారం పోరుమామిళ్ల పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బద్వేలుకు చెందిన అడ్వకేట్, నోటరీ మువ్వా నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మండలంలోని రంగసముద్రం పంచాయతీ మునీర్ కాంప్లెక్సు, సెయింట్ ఆంటోనీస్ స్కూలు సందులో ఉండే లక్ష్మీనరసింహస్వామి స్టాంపువెండర్ లక్ష్మీదేవి, ఆమె తమ్ముడు సిద్దయ్య బద్వేలుకు చెందిన మువ్వా నరసింహులుకు సంబంధించిన సంతకాలు, సీళ్లు, అలాగే ప్రొద్దుటూరుకు చెందిన రామకృష్ణ వెండర్ సంతకాలు, సీళ్లు ఫోర్జరీ చేసినట్లు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేశామన్నారు.

విభజన హక్కుల సాధనకు ఢిల్లీకి....

కడప కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్టానికి ప్రత్యేక హోదా, విభజన హక్కుల సాధనలో భాగంగా జిల్లా కాంగ్రెస్ నేతలు ఉద్యమానికి శుక్రవారం ఉదయం సంపర్క్ కాంత్రి ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీ బయిలుదేరి వెళ్లారు. ఈ సంద ర్భంగా కాంగ్రెస్ నేత ఎస్.ఎ.సత్తార్ మాట్లాడుతూ కడపలో ఉక్కు ఫ్యాక్టరీని సెయిల్ ఆధ్వర్యంలో నిర్మించాలనే డిమాండ్‌తో పాటు విభజన హామీలు నెర వేర్చాలని ఎన్డీఏ సర్కారును ఒత్తిడి చేస్తూ ఢిల్లీలో నిరసన చేపట్టడం జరుగుతోందన్నారు. ఢిల్లీ వెళ్లిన వారిలో కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు నజీర్ అహమ్మద్, నేతలు నాసీర్ హుసేన్, నాసీర్‌ఖాన్, చంద్రశేఖర్ రెడ్డి, మహిళా నాయకురాలు శ్యామలాదేవి, నాగరత్న, అక్రమ్, హబీబ్, గంగాధర్, తాజుద్దీన్, చాన్‌బీ తదితరలు ఉన్నారు.

ఆధిక్యంలో నెల్లూరు.... వెనుకంజలో కడప జట్లు

కడప స్పోర్ట్స్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే (మూడురోజుల) క్రికెట్ టోర్నమెంటులో భాగంగా రెండో రోజైన శుక్రవారం అనంతపురం జట్టుపై నెల్లూరు జట్టు 246 పరుగుల ఆధిక్యతతో వుండగా కడప-కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో కడప జట్టు 184 పరుగుల వెనుకంజలో వుంది. వివరాలిలా.....

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 59.5 ఓవర్లలో 224 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో 6 వికెట్లు కోల్పో యి 93 పరుగులు చేసింది. కాగా ఓవర్‌నైట్ స్కోర్ 93 పరుగులతో తిరిగి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు రెండో రోజైన శుక్రవారం 60.2 ఓవర్లలో 203 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో నెల్లూరు జట్టుకు 21 పరుగుల ఆధిక్యత లభించింది. ఇందులో కిరణ్‌కుమార్ 66 పరుగులు చేశారు. కాగా నెల్లూరు జట్టు రెండో ఇన్నింగ్స్‌కు దిగి ఆట ముగిసే సమయానికి 61 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 225 పరుగులు చేసింది. ఇందులో గురుమోహన్ 66, రిషికుమార్‌రెడ్డి 57 పరుగులు చేశారు. దీంతో ఇప్పటివరకు నెల్లూరు జట్టు 246 పరుగుల ఆధిక్యతతో నిలిచింది.ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-కర్నూలు జట్ల మధ్య సాగు తున్న మరో మ్యాచ్‌లో కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 65.3 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం కడప జట్టు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోర్ 54 పరుగులతో తిరిగి బ్యాటింగ్‌కు దిగి.. 51.2 ఓవర్లలో 114 పరుగులకే అన్ని వికెట్లు కోల్పో యింది. దీంతో కర్నూలు జట్టుకు 43 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధి క్యత లభించింది. ఇక బౌలింగ్ విభాగంలో రుత్విక్ కళ్యాణ్ 5 వికెట్లను పడగొట్టారు. కాగా, కర్నూలు జట్టు రెండో ఇన్నింగ్స్‌కు దిగి ఆట ముగిసే సమయానికి 57.5 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందు లో రోహిత్‌గౌడ్ 51 పరుగులు సాధించారు. దీంతో రెండు ఇన్నింగ్స్‌లకు కలిపి 184 పరుగుల ఆధిక్యతలో కర్నూలు జట్టు నిలిచింది.

ప్రేమించి పెళ్లిచేసుకొని... వదిలేశాడు

- నన్ను నా బిడ్డను చంపడానికి ప్రయత్నిస్తున్నాడు
- డీఎస్పీకి బాధితురాలి ఫిర్యాదు

పులివెందుల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పులివెందులకు చెందిన శ్రీపతి చక్రవర్తి అనే వ్యక్తి తనను ప్రేమించి పెళ్లి చేసుకుని గర్భిణీని చేసి మూడు నెలలకే వదిలేశాడని తిరుపతికి చెందిన కె.లావణ్య అలియాస్ రజని ఆవేదన వ్యక్తం చేశారు. తనను తన బిడ్డను చంపేందుక ప్రయత్నిస్తున్నాడని వాపోయారు. ఈ మేరకు పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్‌కు శుక్రవారం రాత్రి ఆమె ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు..

తిరుపతికి చెందిన రజనీని పులివెందులకు చెందిన శ్రీపతి చక్రవర్తి తిరుపతిలో చదువుకునే సమయంలో ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. చివరకు పెద్దల అంగీకారంతో 2021 ఆగస్టు 15వ తేదీ తిరుపతిలో వివాహం చేసుకున్నాడు. అనంతరం రజని పులివెందులలోని అత్తగారింటికి వచ్చారు. దాదాపు మూడు నెలల పాటు వీరి కాపురం సజావుగా సాగింది. ఇంతలో రజనీ గర్భం దాల్చడంతో భర్త, అత్తమామల నుంచి వేధింపులు మొదలయ్యాయి. ఈ విషయం తన తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు తమ కూతురి జీవితం నాశనం చేయొద్దని అల్లుడి కుటుంబసభ్యులను ప్రాధేయపడ్డారు. అప్పటి నుంచి రజనీని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేయడం మొదలు పెట్టారు. వీరి వేధింపులు ఎక్కువ కావడంతో విధిలేని పరిస్థితిలో గర్భవతియైన కుమార్తె రజనీని ఆమె తల్లిదండ్రులు తిరుపతికి తీసుకెళ్లారు. అయితే వీరిని శ్రీపతి చక్రవర్తి బంధువుల ద్వారా బెదిరించడం మొదలు పెట్టాడు. బిడ్డ పుట్టాక కూడా అతడిలో మార్పు రాకపోగా.. బిడ్డను తీసుకొని వస్తే నిన్నూ నీ బిడ్డను చంపుతామని బెదిరించాడు. దీంతో తాను, తన బిడ్డ భయంభయంగా గడుపుతున్నామని రజని తెలిపారు. తన కుమారుడు పెద్దయితే ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందని చంపేందుకు రెండుసార్లు రెక్కీ నిర్వహించారని అన్నారు. కొన్ని నెలల క్రితం పులివెందులకు చెందిన మరొక అమ్మాయిని తనకు తెలియకుండా తన భర్త వివాహం చేసుకున్నాడన్నారు. దీనిపై తిరుపతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. కానీ న్యాయం జరుగుతుందో లేదోనని.. పులివెందులకు వచ్చి డీఎస్పీ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



డీఎస్పీ మురళినాయక్‌కు ఫిర్యాదు చేస్తున్న రజని

మెప్మా కార్యాలయంలో 'ప్రైవేటు' పంచాయితీలు

- రుణాల వసూళ్లపై బెదిరింపులు

పులివెందుల రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని మెప్మా కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులు డ్వాక్రా సంఘాల విషయంలో తల దూర్చి పంచాయితీలు చేస్తున్నారు. శుక్రవారం 12గంటల సమయంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు బ్యాంకు రుణాలు చెల్లించని వారిపట్ల దురుసుగా ప్రవర్తించారు. వివరాల్లోకి వెళి తే.. పులివెందుల మున్సిపాలిటీలో డ్వాక్రా సంఘాల ద్వారా కొందరు మహిళలు రుణాలు పొందారు. రెండేళ్ల కిందట ఒక్కొ క్కరు రూ.2లక్షలు రుణం పొందినట్లు సమాచారం. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించలేక పోయారు. అయితే తీసుకున్న రుణానికి సంబంధించి డబ్బులు చెల్లించాలంటూ ఆర్పీలు ప్రైవేటు వ్యక్తులను రంగంలోకి దించి బెది రింపులకు దిగారు. దీంతో ఆ మహిళలు తాము ఇప్పుడిప్పుడే ఆర్థిక భారం నుంచి బయట పడుతున్నామని, ఎలాగోలా నెలనెల చెల్లిస్తామని బతిమాలాడారు. మీరు కట్టా ల్సింది రూ.5వేలు, రూ.10 వేలు కాదు లక్ష రూపాయలకు పైగా అప్పు ఉన్నారంటూ బెదిరించారు. ఈ తతంగం అంతా మెప్మా కార్యాలయంలో జరగడం గమనార్హం. ఈ విష యమై పులివెందుల మెప్మా సీఎం హరిప్రసా ద్‌రెడ్డి వివరణ ఇస్తూ... రుణం పొందిన వారు చెల్లించకుంటే బయటే చూసుకోవాలి. మెప్మా కార్యాలయంలో అడగడం పద్ధతి కాదు. అక్కడ ఉన్న సిబ్బందితో వివరణ తీసుకుంటామని తెలిపారు.



మెప్మా కార్యాలయంలో మహిళలను ప్రశ్నిస్తున్న ప్రైవేటు వ్యక్తులు

అదుపుతప్పి లారీ బోల్తా...
డ్రైవర్, క్లీనర్ మృతి



గంగాదేవి పల్లె సమీపంలో బోల్తాపడ్డ లారీ



కమల్‌సాహెబ్, ఫక్రుద్దీన్ మృతదేహాలు

ముద్దనూరు జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి కడప,తాడిపత్రి హైవేరోడ్డులోని గంగాదేవిపల్లె సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో కర్నాటక రాష్ట్రం బళ్లారి జిల్లాకు చెందిన లారీడ్రైవర్ కమల్‌సాహెబ్(64), క్లీనర్ ఫకృద్దీన్(45) ఇరువురు అక్కడిక్కడే మృతి చెందారు. ఎస్ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు వివరాలు... బళ్లారి నుంచి చెన్నైకి లారీలో ఇనుప పైపులను తీసుకొని వెళుతున్నారు. గంగాదేవి పల్లె సమీపంలోకి రాగానే లారీ అదుపు తప్పి చీనీ తోటలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయ్యింది. లారీడ్రైవర్ కమల్‌సాహెబ్, క్లీనర్ ఫకృద్దీన్ లారీలో ఇరుక్కుపోయి మృతి చెందారు. వెంటనే సీఐ దస్తగిరి సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాలను అతికష్టం మీద బయటకు తీయించారు. లారీ ఓనర్ అమీర్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి



గాయపడిన జింక

మైదుకూరు రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అటవీ జింకపై కుక్కలు దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావమై మృతి చెందింది. గురువారం అడవి నుంచి ఒక జింక తప్పించుకొని బద్వేలు రోడ్డులోని సబ్‌స్టేషన్ వద్ద తిరు గుతుండగా కుక్కలు వెంబడించి జింకను గాయపరిచాయి. కాగా అక్కడే నివశిస్తున్న ముడియం ప్రసాద్ మరి కొందరి సాయంతో కుక్కల బారి నుంచి జింకను రక్షించాడు. అనంతరం ప్రథమ చికిత్స చేసి ఫారెస్ట్ అధి కారు లకు అప్పగించారు. అయితే గాయపడిన జింకకు మైదుకూరు వెటర్నరీ ఆసుపత్రిలో చికిత్స నిర్వహించినా.. తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి చెందినట్లు ప్రొద్దుటూరు ఫారెస్ట్ అధికారి హేమాంజలి తెలిపారు. అధికారుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి నట్లు ఆమె తెలిపారు.

రోగులతో దురుసుగా ప్రవర్తించరాదు



ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న మండల అధికారులు

నిమ్మనపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులతో వైద్య సిబ్బంది దురుసుగా ప్రవర్తించరాదని తహసీల్దార్ తపస్విని, ఎంపీడీఓ రమేష్ సూచించారు. శుక్రవారం ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఆస్పత్రి రికార్డులు, హాజరు పరిశీలించారు. అనంతరం ఆస్ప త్రికి వచ్చే రోగుల సంఖ్యను తనిఖీ చేసి ప్రజలకు సకాలంలో వైద్యం అందించాలన్నారు. ఆస్పత్రిలో ఇద్దరు డాక్టర్లు విధులు నిర్వర్తించాల్సి వుండగా కొన్ని నెలలుగా డాక్టరు ప్రత్యూష మాత్రమే విధులకు హాజరవుతుండంతో మరో డాక్టర్ గురించి ఆరా తీశారు. తనంతరం ఆస్పత్రి మరుగుదొడ్లు పరిశీలించి మందులపై ఆరా తీశారు. కాగా ఆస్పత్రిలో ఒక నర్సు మాత్రమే వుండడంతో రాత్రిళ్ల విధులు నిర్వర్తించేందుకు కష్టమైందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

గుర్రంకొండ, జూలై 18(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ లక్ష్మీనరసయ్య సిబ్బందికి సూచించారు. తరిగొండ ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి వచ్చే పేద ప్రజలకు మంచి వైద్యం అందించాలని డాక్టర్‌కు సూచించారు. ఆస్పత్రిలో మందులు కొరత లేకుండా తగు జాగ్రత్తలను తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలం ప్రారంభం కానుండడంతో రోగాలు ప్రబలకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ చిన్నరెడ్డెప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మంచి చేద్దాం

మార్కెట్ కమిటీ చైర్మెన్ జంగాల శివరాం



జంగాల శివరాంను సన్మానిస్తున్న తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, తదితరులు

మదనపల్లె, జూలై 18(ఆంధ్రజ్యోతి): రైతులకు మంచి చేద్దామని మార్కెట్ కమిటీ చైర్మెన్, జనసేన ఉమ్మడి ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం అన్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, నేతలు, కార్యకర్తలు ఆయనను సన్మానించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గంగారపు రామ్‌దాస్‌చౌదరి ఆధ్వర్యంలో జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు, కార్యకర్తలు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అడుగుజాడల్లో నడుస్తూ, అతిపెద్ద మార్కెట్ అయిన టమోటా మార్కెట్‌ను అభివృద్ధి వైపు నడిపిస్తామన్నారు. డిప్యూటీ సీఎం సహా సీఎం చంద్రబాబు, మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, గంగారపు రామ్‌దాస్ చౌదరి, టీడీపీ తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరాంచినబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కమ్మవీధిలో సాయంత్రం వరకూ సందడి నెలకొంది.

ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం, తల్లిదండ్రులు

కలకడ, జూలై 18(ఆంధ్రజ్యోతి): పిల్లలకు ఓనమాలు నేర్పి భావిపౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. ఎర్రకోటపల్లె ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయులు శంకర్‌ప్రసాద్, శంకారాచారులను హెచ్‌ఎం హసన్‌షా ఆధ్వర్యంలో సన్మానించారు. అంకిత భావంతో పని చేసి విద్యార్థుల అభివృద్ధి కృషి చేసిన వారిని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మెన్ రెడ్డిశేఖర్, క్రిష్ణయ్య, దమోదర్‌నాయుడు, సోమశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలకే ప్రాధాన్యం



ఈయూ గౌరవాధ్యక్షుడిని సన్మానిస్తున్న యూనియన్ నేతలు

మదనపల్లె అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపోల పరిధిలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్టీసీ వన్ అండ్ టూ డిపోల ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి అన్నారు. మదనపల్లె ఎంప్లాయిస్ యూనియన్ నేతలతో కలిసి టూ డిపో మేనేజరు అమరనాథ్‌ను కలిసి డిపోలో జరుగుతున్న అభి వృద్ధి పనులపై ఆరా తీశారు. భవిష్యత్ అవసరాలపై డీఎంతో చర్చించారు. మొదటి సారి డిపోకు విచ్చేసిన ఆయనను సన్మానించారు. డిపో పరిధిలో నిలిచిపోయిన సర్వీసులను పునరుద్ధరించాలని, బస్‌స్టాండ్‌లో ఆధునిక మరుగుదొడ్ల నిర్మాణం, కార్గో భవన నిర్మాణం, రూ.12 లక్షలతో సీసీ రోడ్లు, బస్టాండ్‌లో ప్లాట్ ఫారం తదితరాల్లో ఇప్పటి వరకు వచ్చిన అనుమతులు, పంపిన ప్రతిపాదనలు గురించి వివరాలు డీఎంను అడిగి తెలుసుకున్నారు. గ్యారేజ్‌ను పరిశీలించారు. కార్మికులను కలిసి యోగక్షేమాలను అడిగారు. సమష్టిగా అభివృద్ధి పథంలో నడిచి సమస్యల పరిష్కారిద్దామన్నారు. కార్యక్రమంలో డీఎం అమరనాథ్, ఈయూ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్వీ కుమార్, జిల్లా అధ్యక్షుడు సీఏబాబు, డిపో కార్యదర్శి హుసేన్, జాయింట్ కార్యదర్శి బీసీఎస్ నాయక్, ఉపాధ్యక్షుడు మల్లికార్జున, సురేష్, గోపాల్ పాల్గొన్నారు.

తుమ్మరకుంటలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ పరిశీలన

పెద్దతిప్పసముద్రం జూలై 18 (ఆంధ్రజ్యోతి): తుమ్మరకుంటలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణలో భాగంగా కేంద్ర బృంద సభ్యులు రాజేష్, అంజనేయులు గ్రామాన్ని సందర్శించారు. ఈఓపీఆర్డీ మోహన్‌ప్రతాప్, పంచాయతీ కార్యదర్శులు శ్వేత, ప్రమీలతో కలిసి గ్రామస్తులతో చర్చించారు. వీఆర్వో హైదర్‌షా, టీడీపీ నేత సుధాకర్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

అధికారులు బాధ్యతగా పని చేయాలి ● వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు ఉండాలి
మెనూ తప్పక పాటించాలి ● ఆకస్మిక తనిఖీ చేసిన డీఎల్‌డీఓ అమర్‌నాథరెడ్డి

కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు శుక్రవారం సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలను అధికారులు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. తంబళ్లపల్లెలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీఎల్‌డీఓ అమర్ నాథరెడ్డి, పెద్దమండ్యంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ, మండల ప్రత్యేకాధికారి ఎస్. కృష్ణ, ఆయా మండలాల ఎంఈఓ, ఎంపీడీఓలు తనిఖీ చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, పారిశుద్ధ్యం, విద్యార్థుల హాజరు, నైపుణ్యం వంటి అంశాలు తనిఖీ చేశారు. వంట గదులను పరిశీలించి సరుకులు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. మెనూ మేరకు భోజనం వండుతున్నారా.? లేదా.? అన్నది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో విద్యార్థు ల సంఖ్య వసతులపై ఆరా తీశారు. వివరాలోకెళితే...



తంబళ్లపల్లెలో విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూస్తున్న ప్రత్యేకాధికారి అమర్‌నాథరెడ్డి, ఎంఈఓ త్యాగరాజు

తంబళ్లపల్లె, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెనూ మేరకు నాణ్యమైన భోజనం అందించాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీఎల్‌డీఓ అమర్‌నాథరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన ఎంఈఓ త్యాగరాజు, ఎంపీడీఓ థామస్‌రాజుతో కలిసి మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. అంగళ్లు చేనేత నగర్‌లోని బీసీ రెసిడెన్సియల్, తంబళ్లపల్లెలోని కేజీబీవీ, ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల, మోడల్ స్కూల్, హాస్టల్‌ను తనిఖీ చేశారు. పలు పాఠశాలల్లో విద్యార్థులతో కలసి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం రుచి చూశారు. మోడల్ స్కూల్ హాస్టల్ భవనం, ప్రహరీ మంజూరు చేయించాలని ప్రిన్సిపాల్ హేమంత్ కుమార్ డీఎల్‌డీఓను కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి మంజూరుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పీటీఎంలో బాలుర వసతి గృహాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి భరత్‌కుమార్

అధికారులు బాధ్యతగా పని చేయాలి

పెద్దమండ్యం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు సవ్యంగా సాగడానికి అధికారులు బాధ్యతగా పని చేయాలని జిల్లా సోసెల్ వెల్ఫేర్ డీడీ, పెద్దమండ్యం మండల ప్రత్యేకాధికారి ఎస్. కృష్ణ అన్నారు. పెద్దమండ్యం, కలిచెర్ల, సిద్దవరం, ప్రభుత్వ పాఠశాలలు, కలిచెర్ల బీసీ హాస్టల్, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. పెద్దమండ్యం ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీఓ శ్రీధర్ రావు, విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. పెద్దమండ్యం లేఆవుట్‌లో పక్కాగృహ నిర్మాణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి విడుదలైన ప్రభుత్వ నిధులు సద్వినియోగం చేయాలన్నారు. పారిశుధ్య పనులపై దృష్టి సారించి స్వచ్ఛ కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. తహసీల్దార్ తేజస్వి, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, కార్యదర్శులు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ బాలుర వసతి గృహం తనిఖీ

పెద్దతిప్పసముద్రం జూలై 18 (ఆంధ్రజ్యోతి): బీసీ బాలుర వసతి గృహాన్ని మెగా పీటీఎం మండల ప్రత్యేక అధికారి భరత్ కుమార్, తహసీల్దార్ శ్రీరాములు నాయక్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఉదయం 9 గంటలకు బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. మరుగుదొడ్లు, నీటి తొట్టిలు, స్నానపు గదులను వారు పరిశీలించారు. మంచినీటి సౌకర్యంపై ఆరా తీశారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలిగినా మాకు తెలపాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

మెనూ తప్పక పాటించాలి

గుర్రంకొండ, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని మండల స్పెషల్ ఆఫీసర్ రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని బాలికల గురుకుల పాఠశాలను ఆయన అధికారులతో కలిసి తనిఖీ చేశారు. పాఠశాలకు సొంత భవనం లేక ఇబ్బంది పడుతున్నట్లు విద్యార్థులు తెలిపారు. గురుకుల పాఠశాల్లో బాలికలకు సరైన మరుగుదొడ్లు లేవని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎంఈఓ సురేంద్రబాబు, రెవెన్యూ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలు ఉండాలి

వాల్మీకిపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ బాలబాలికల వసతి గృహాల్లో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ పామిలేటి, ఎంపీడీఓ మనోహర్‌రాజు హాస్టళ్ల స్థితిగతులు, విద్యార్థుల సౌకర్యాలు, భోజన వసతి, తదితర వాటిపై వివరాలు ఆరా తీశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం విషయంలో స్టోర్‌రూమ్‌లలోని బియ్యం, కూరగాయలు, పప్పు దినుసులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పట్టణంలోని బీసీ బాలికల సంక్షేమ హాస్టల్ భవనాల అసౌకర్యాలు, ఇబ్బందులను అధికారులు పరిశీలించారు. స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహానికి రూ.33.8 లక్షలు, బాలికల వసతి గృహానికి రూ.29.8లక్షలు నిధులతో ఇప్పటికే మరమ్మతుల పనులు పూర్తి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు తదితర వివరాలన్నింటినీ జిల్లా ఉన్నతాధి కారులకు నివేదికలు పంపించి వారి ఆదేశాల మేరకు పరిష్కార చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, హాస్టళ్ల వార్డెన్‌లు, తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకిపురం బాలికల వసతి గృహం పైకప్పు పరిశీలిస్తున్న ఎంపీడీఓ మనోహర్‌రాజు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

● నాలుగేళ్లలో మరింత అభివృద్ధి : టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి



పథకాలను వివరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

తంబళ్లపల్లె, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం బాలిరెడ్డిగారిపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగులో ఇన్‌చార్జి టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఏడాది పాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను కరపత్రాలు అందించి వివరించారు. ఆయన మాట్లాడుతూ ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. రాబోయే నాలుగేళ్లలో తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. వైసీపీ పాలనలో మరుగునపడిన రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు సీఎం అయ్యాక మళ్లీ గాడిన పడుతోందన్నారు. మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్ నాయుడు, పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర, పార్లమెంటు బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి బేరి శీన, మదన్‌మోహన్‌రెడ్డి, పురుషోత్తం, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, తెలుగు యువత నరసింహులు, వికలాంగ అధ్యక్షుడు రామాంజులు, గంగులరెడ్డి, లక్ష్మీనారాయణనాయుడు, జయ రాం రెడ్డి, నరేంద్రనాయుడు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో....

బి.కొత్తకోట, జూలై 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచక పాలననుంచి రాష్ట్రాన్ని విముక్తి చేసి సంక్షేమ పాలనను అందిస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ప్రజలను కోరారు. ఇంటింటికీ టీడీపీలో భాగంగా ఆయన బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ గుట్టపాళ్యం, నల్లగుట్లపల్లె తదితర గ్రామాల్లో పర్యటించారు. నేతలు గంజి మోహన, మొటుకుశివ, రెడ్డెన్న, గుట్టపాళెం నర్సింహారెడ్డి, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

శాకంబరి దేవిగా మారెమ్మ దేవత



మదనపల్లె, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దిగువకమ్మపల్లెలో వెలసిన మారెవ్మదేవత శాకంబరి దేవిగా భక్తులకు అభయం ఇచ్చారు. ఆషాడమాస పూజల్లో భాగంగా శుక్రవారం నిర్వాహకులు అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించారు. దిగువకమ్మపల్లెలో ఇటీవల కొత్తగా ఆలయాన్ని నిర్మించారు. రెండు నెలలుగా రోజూ పూజలు చేస్తూ మొక్కులు తీర్చుకుంటున్నారు. శుక్రవారం ప్రత్యేక అలంకరణ, పూజల్లో భాగంగా శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

రామసముద్రం, జూలై 18(ఆంధ్రజ్యోతి): చెంబకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డెంగీ నివారణ మహోత్సవాలు నిర్వహించా రు. వైద్యాధికారి జాహ్నవి, చరిత, పాఠశాల విద్యార్థులు ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ జాహ్నవి మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు ఉండకుండా చూడాలన్నారు. నిల్వ నీటిలో దోమలు వ్యాప్తి చెంది డెంగీ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటాయన్నారు.

సీటీఎం కమిటీ అధ్యక్షుడిగా పగడాల నాగేంద్ర



మదనపల్లె అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి):సీటీఎం టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. కమిటీ అధ్యక్షు డిగా పగడాల నాగేంద్ర, ఉపాధ్యక్షుడిగా నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శిగా డాకన్న, కోశాధి కారి లలిత కుమారి, కార్యనిర్వాహక కార్యదర్శులు సాయి కుమార్, శ్రీనివాసులు, సాంబశివా రెడ్డి, కార్యదర్శులు మహబూబ్‌బాషా, సర్వేశ, నాగరాజను ఎన్నుకున్నారు.

ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసలు

మదనపల్లె అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ టూ డిపోలో ఆదర్శ ఉద్యోగుల ప్రశంసల సభ నిర్వహించినట్లు డిపో మేనేజరు అమరనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం బస్‌స్టాండ్‌లో సమావేశం ఏర్పాటు చేసి జూన్‌లో ప్రతిభ కనపర్చిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందించి అభినందించారు. ఆదే స్ఫూర్తితో ప్రతి ఉద్యోగి డిపో అభ్యున్నతికి కృషి చేయాలన్నారు.

నేడు, రేపు యల్లమ్మ తల్లి తిరునాళ్లు

పీలేరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మోడల్ కాలనీలో వెలసిన యల్లమ్మ తల్లి ఆలయంలో శని, ఆదివారాల్లో తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త దేవిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం రాత్రి జాగరణ, అమ్మవారి కథాకాలక్షేపం, ఆదివారం సాయంత్రం అమ్మవారికి అభిషేకం, బోనాలు ఉంటాయని ఆయన వివరించారు. భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

మెరుగైన వైద్యం అందించాలి

పీలేరు రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యం అందించాలని పీలేరు మండల ప్రత్యేకాధికారి, జిల్లా పరిశ్రమల అధికారి క్రిష్ణకిషోర్ తెలిపారు. శుక్రవారం తలపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. కార్పొరేట్ తరహా వైద్యం అందించేందుకు అవసరమైన వసతులు, మందులు ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని తెలిపారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

తంబళ్లపల్లె, జూలై 18(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని సీడీపీఓ సుజాత ఆదేశించారు. శుక్రవారం కన్నెమడుగు, అప్పమ్మగారిపల్లె, గోపిదిన్నె అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం రికార్డులు, స్టాకు, పిల్లల హాజరును పరిశీలించారు. ఆధార్ తీసుకోని పిల్లలకు వారి తల్లితండ్రులతో మాట్లాడి ఆధార్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

పెద్దతిప్పసముద్రం జూలై 18 (ఆంధ్రజ్యోతి): చెన్నకేశవస్వామి ఆలయ సమీప అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు అందించే పౌష్టికాహారం కిట్లను పరిశీలించారు. గర్భిణులు బాలింతలు, పిల్లలకు అందించే పౌష్టికాహారం విషయంలో జాగ్రత్తలను పాటించాలని, కాలం చెల్లిన వాటిని పంపిణీ చేయరాదన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు



మదనపల్లె అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ధూపదీప నైవేద్యాలు సమర్పించి విశేషాలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. శుక్రవారం మహిళలు రాహుకాల సమయంలో ఆలయం చేరుకుని చీర, జాకెట్లు, పసుపు, కుంకుమ, పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. నిమ్మకాయలపై నెయ్యివత్తులతో దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆల యకమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు జోలెపాళెం కరుణాకర్ నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్ నాయుడు, తదితరులు పర్యవేక్షించారు.

సంక్షేమ హాస్టళ్ల తనిఖీ

బి.కొత్తకోట, జూలై 18(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ హాస్టళ్లను అధికారుల బృందం తనిఖీ నిర్వహించింది. చంద్రమాకులపల్లె సమీప గురుకుల పాఠశాలలో వసతిగృహం, తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, మౌలిక వసతులపై ఆరా తీశారు. బీసీహాస్టల్‌లో కేవలం ఎన్నిమిది మంది విద్యార్థులు వుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల ప్రత్యే కాధికారి నీలకంఠారెడ్డి, తహసీల్దార్ బావాజాన్, నగరపంచాయతీ కమిషనర్ జీవీ పల్లవి, ఎంపీడీఓ కృష్ణవేణి, ఎంఈఓ భీమేశ్వరాచారి పాల్గొన్నారు.

శుద్ధి చేసిన తాగునీరు అందించాలి

కలికిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లోని విద్యార్థులకు శుద్ధిచేసిన తాగునీటిని అందించాలని తహసీల్దారు హరికుమార్ సూచించారు. వర్షా కాలంలో కాచి వడబోసిన తాగునీటిని ఇవ్వాలన్నారు. శుక్రవారం రాత్రి ఆయన కలికిరి బీసీ, మేడికుర్తి ఎస్సీ విద్యార్థుల సంక్షేమ వసతి గృహాలను ఆకస్మి కంగా సందర్శించారు. మేడికుర్తిలో వార్డెన్ లేకపోవడాన్ని గుర్తించారు. తహసీల్దారు వెంట ఎంఈఓ-2 నాగార్జున, సర్వేయర్ రెడ్డెప్ప, వీఆర్వో తదితరులు ఉన్నారు.

21న మాజీ సీఏం కిరణ్‌కుమార్ రెడ్డి కలికిరి రాక

కలికిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, బీజేపీ నేత నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి సోమవారం కలికిరి రానున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఎం.కృష్ణప్ప తెలిపారు. ఉదయం 6.25 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి 8.25కు బెంగుళూరు విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ప్రయాణించి నేరుగా వాల్మీకిపురం మండలం గండబోయనపల్లె పంచాయతీ కంభంవారిపల్లెకు 12.15కు చేరుకుంటారు. అక్కడ వాల్మీకిపురం మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు కంభం నిరంజన్ రెడ్డి తండ్రి కార్యక్రమాలకు హాజరవుతారు. మధ్యాహ్నం 1.30 గంటలకు కంభంవారిపల్లెలో బయలుదేరి 2 గంటలకు కలికిరి చేరుకుని ఇక్కడే బస చేస్తారు. ఆ మరుసటి రోజు కార్యక్రమాల వివరాలను తర్వాత తెలియజేస్తామన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

పీలేరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా రెండో మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ నేతలు సాంబశివ, టీఎల్ వెంకటేశ్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఆగస్టు 10, 11, 12వ తేదీల్లో మదనపల్లెలో జరగనున్న జిల్లా మహాసభల ప్రచార కరపత్రాలను శుక్రవారం హమాలీలతో కలిసి ఆవిష్కరించారు. జిల్లా సమగ్రాభివృద్ధి చెందాలంటే హంద్రీ-నీవా, గాలేరు-నగరి, అన్నమయ్య, తదితర నీటి ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మూతపడిన పరిశ్రమలను తెరిపించడం, కొత్త పరిశ్రమల ఏర్పాటుతో యువత వలసలను నిరోధించవచ్చన్నారు. జిల్లా అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ పీలేరు కార్యదర్శి నరసింహులు, హమాలీ యూనియన్ నేతలు వీవీ రమణ, దాము, వెంకటేశ్, రామచంద్ర, మల్లికార్జున, సురేశ్, మురళీ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించుకోవాలి

మదనపల్లె టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచుకోవాలని బెంగళూరుకు చెందిన హెచ్‌పీఈ సంస్థ మేనేజర్ జగదీశ్ పేర్కొ న్నారు. శుక్రవారం స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనలియర్ విద్యార్థులకు కెరీర్ ప్రిపరేషన్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కోర్సు పూర్తి అయ్యే సరికి ఉద్యోగాన్వేషణలో ఇంటర్వ్యూలకు ఎలా తయారు కావాలి, గ్రూప్ డిస్కషన్స్ ఎలా వుంటాయనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నాలజీలో మార్పులను గమనిస్తూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్స్ వీఏఎన్ భాస్కర్, పీఓ కేధార్‌గౌరవ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రీజనల్ సైన్స్ సెంటర్ పోటీల్లో పీలేరు విద్యార్థుల ప్రతిభ

పీలేరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉపగ్రహ నమూనాల తయారీలో తిరుపతిలోని రీజనల్ సైన్స్ సెంటర్ వారు నిర్వహించిన పోటీల్లో పీలేరు శ్రీ భువన విద్యాలయం విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 16 పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా భువన విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ ఉమా రమాదేవి, ప్రిన్సిపాల్ గుణలక్ష్మి మాట్లాడుతూ తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విశాల్ భరద్వాజ్, అరుణేంద్ర నాయక్, సమీర్ జట్టుగా ఏర్పడి ఉపగ్రహ తయారీ, పని విధానంపై సమగ్రంగా డెమో ఇవ్వడంతో ద్వితీయ స్థానం లభించిందన్నారు. ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.